


నేటి దినపత్రిక **సూర్య**
www.suryaa.com
19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,16 డిశంబర్ 2025 | 8 పేజీలు


# అన్నవరం వ్రత పురోహితుల 'దానాల' దోపిడీ!



## - రుజువైన అక్రమ వసూళ్లు... కలెక్టర్ సీరియస్!



జిల్లా కలెక్టర్ షాన్మోహన్

- ఏడుగురు పురోహితులపై సస్పెన్షన్ వేటు తప్పదా?
- గత ఈవో 'అవినీతి రక్షణ'!
- భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వైనంపై జిల్లా కలెక్టరేట్ యంత్రాంగంకీలక ఆదేశాలు
- పిజిఆర్ఎస్‌లో భక్తుడు రవికిరణ్ మరోసారి ఫిర్యాదు

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** ఆంధ్రులఆరాధ్యదైవం,శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామివారి పవిత్రక్షేత్రం అన్నవరంలో పురోహితులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే తీవ్ర ఆరోపణలు రుజువైన నేపథ్యంలో, కాకినాడ జిల్లా కలెక్టర్ సి.షన్ మోహన్ ఈ వ్యవహారంపై అత్యంత సీరియస్‌గా స్పందించారు.భక్తుడు నీలాపు రవి కిరణ్ సమర్పించిన తాజా పిజిఆర్ఎస్ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ కార్యాలయం, ఏడుగురు వ్రత పురోహితులపై చట్టపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఈవోకు కీలక ఆదేశాలు జారీ చేసారని తెలుస్తోంది.

**భక్తుడి రెండోఫిర్యాదు సారాంశం:**కాకినాడకు చెందిన రవి కిరణ్ గత నెల పదో తేదీన చేసిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాలతో దేవస్థానం విచారణ జరపగా, ఏడుగురు వ్రత పురోహితుల అక్రమ వసూళ్లకు పాల్పడింది వాస్తవమేనని తేలింది. వ్రత మండపంతలుపులు బిగించి,సెల్‌ఫోన్లు అందుబాటు లోకి లేకుండా చేసి, భక్తులను దానాల పేరుతో భయభ్రాంతులకు గురిచేసి, ఒక్కో వ్రత భక్తుని నుంచి కనీసం రూ.500/- వసూలు చేసినట్లు సీసీ ఫుటేజ్ మరియు వాయిస్ రికార్డింగ్‌లలో స్పష్టంగా రుజువైంది. ఆ రోజు సుమారు 8000 వ్రతాలు జరిగాయి. దీనిద్వారా రోజుకు లక్షలాది రూపాయల అక్రమ వసూళ్లు జరిగినట్లు బహిర్గతమైంది.

**గత ఈవోపై ఆరోపణలు:** విచారణలో విషయం నిరూపితమైనా, గత కార్యనిర్వహణాధికారి సుబ్బారావు తూతూ మంత్రంగా కేవలం వ్రత కథ చెప్పిన ముగ్గురు సెకండ్ గ్రేడ్ పురోహితులను సస్పెండ్ చేయకుండా సంబంధిత పురోహితులు సవితాల వీర వెంకట రమణ,పెద్దింటితేజస్వి,పెండ్యాల వి.ఆర్. బి.కె.శర్మ ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధించి, మూడునెలలు కథలు చెప్పకుండా



గత నెల 9వ తేదీన భక్తుల నుంచి బహుమతి పేరుతో అదనపు వసూళ్ళు ఋజువైంది.

నిలిపివేయడం తప్ప, స్పెషల్ గ్రేడ్ పురోహితులు చామర్తివెంకటరెడ్డిపంతులు, పొన్నపల్లి వెంకటశాస్త్రి, తౌయ్యేటి వెంకట హరనాధ సుబ్రహ్మణ్యం, చామర్తి జగ్గారావులపై చర్యలు తీసుకోకుండా వివరణ కోరడంతో సరిపెట్టారు.ఇదికేవలం "అక్రమార్కులను కాపాడడం కోసం గత ఈవో సుబ్బారావు చేసిన అవినీతి రక్షణ"గా రవి కిరణ్ తన ఫిర్యాదులో తీవ్రంగా ఆరోపించారు.

- తరువాయి 2లో..

## ప్రజా సమస్యల పరిష్కారానికి కెఎంసి ముందడుగు

- ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో 'ప్రజా పిర్యాదుల స్వీకరణ'
- వేగవంతమైన పరిష్కారమే లక్ష్యం పౌర సేవల్లో పారదర్శకతకు కృషి : ఎమ్మెల్యే కొండబాబు




**కాకినాడ,మేజర్‌న్యూస్ :** పౌరులకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించే లక్ష్యంతో కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం విస్తృత స్థాయిలో 'ప్రజా పిర్యాదుల స్వీకరణ' కార్యక్రమం విజయవంతంగా జరిగింది.నగర ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. కెఎంసి ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో ప్రజలుహాజరయ్యారు.

- తరువాయి 2లో..

## దేవస్థానం పవిత్రతను కాపాడండి

- కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** అన్నవరం దేవస్థానం నూతన ఈఓ త్రినాథరావు సోమవారం కలెక్టర్ షణ్మోహన్‌ను ఆయన కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిశారు.కలెక్టర్ నూతన ఈవో వేంద్ర త్రినాథ్‌రావును అభినందించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం రాష్ట్రంలోనే అత్యంత ముఖ్యమైన,పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటని పేర్కొన్నారు. "స్వామివారి పవిత్రతను, వైభవాన్ని కాపాడటంలో అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి" అనికలెక్టర్ షణ్మోహన్ నూతనఈఓకు సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ ప్రతిష్టను ఇనుమడింపజేసేలా

- తరువాయి 2లో..

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా - ప్రజా దర్బార్

- మంత్రి సుభాష్ ప్రజా దర్బార్‌కు 800 అర్జీలు
- ప్రతి సమస్యను పరిష్కరిస్తా : మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, నిత్యం ప్రజల సమస్యల స్వీకరణ కొనసాగించడమే కాకుండా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం రామచంద్రపురంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ ప్రజా దర్బార్‌కు రామచంద్రపురం, రామచంద్రపురం రూరల్ గ్రామాల నుంచి 800 మంది అర్జీలు ఇచ్చారు. కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు,

- తరువాయి 2లో..

# అన్నా క్యాంటీన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



గోపాలపురం, మేజర్ న్యూస్:గోపాలపురం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన ఉంచుతానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్ భావన నిర్మాణాన్ని, గ్రామంలో జరుగుతున్న శాశ్వత ఆయన సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభి వృద్ధి విషయంలో రాజీ పడేది లేదన్నారు సుదీర్ఘకాలగా అపరిస్కృతంగా ఉన్న సమస్యలను సైతం దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు జాతీయ రహదారికి అనుసంధానం చేసి అంతర్గత రహదారుల నిర్మాణానికి 17.25 కోట్ల రూపాయలు మంజూరయ్యాయ న్నారు త్వరలోనే రోడ్లకు మహాదశ రానున్నద న్నారు పేదలకు పచ్చడ అన్నం పెట్టి ఆకలి తీర్చాలన్న అన్న ఎన్టీఆర్ సంకల్పానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంకురార్పణ వేశారన్నారు దీంతో రాష్ట్రవ్యాప్తంగా వందలాది అన్న క్యాంటీన్లు ఏర్పడ్డాయి అన్నారు కూటమి ఐక్యతను చాటి చెప్పేలా నాయకులు సమన్వయం తో ముందుకు వెళ్లాలన్నారు నల్లజర్లలో నిర్వహించిన మెగా గ్రాండ్ క్రిస్మస్ కు వేలాది సంఖ్యలో పాల్గొన్న నాయకులకు కార్యకర్తలకు విశ్వాసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు భూ రెడ్డి శ్రీనివాస్ ఏం సి డైరెక్టర్ కోండ్ర ప్రసాద్ బాబు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమర శ్రీనివాసరావు పార్టీ మాజీ అధ్యక్షుడు రొంగల్ సత్యనారాయణ మండల ప్రధాన కార్యదర్శి చిన్న వెంకటేశ్వరరావు సీనియర్ నాయకులు ఈలు శరత్ బాబు జేష్ట శ్రీధర్ కోటి గంగరాజు కుందుల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ - 2026 నిర్వహణపై అవగాహన సదస్సు




**రాజమహేంద్రవరం,మేజర్న్యూస్** : ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామి నేషన్స్ - 2026 నిర్వహణపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందని జోన్- 1, జోన్ -2 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు టి. శేఖర్ బాబు తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం నగరంలోని ఎస్.కె.ఆర్. మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ విద్య 2025 - 26 విద్యాసంవత్సరానికి సంబంధించిన నూతన సంస్కరణలు, పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి పి. రాఘవ కుమారి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో జోన్ - 1, 2 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు టి.శేఖర్ బాబు మాట్లాడుతూ, రాబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అమలులోకి వచ్చిన నూతన సంస్కరణలు అన్ని సజావుగా అమలు చేయాలని,

ఈ విషయంలో అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వృత్తి విద్యాధికారి డి. విజయ శ్రీ మాట్లాడుతూ, వివిధ పరీక్షలకు 24 పేజీలు, 32 పేజీల జవాబు పత్రాలు ఏ పరీక్షలకు ఇవ్వాలో వివరంగా తెలియజేశారు. అలాగే ఈసారి పరీక్షలు 23 రోజులు కొనసాగనున్న నేపథ్యంలో అవసరమైన సంఖ్యలో ట్రంకులు, ట్రంక్ బాక్సులు ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి ఎన్.ఎస్.వి.ఎల్. నరసింహం మాట్లాడుతూ, కొత్తగా ప్రవేశపెట్టిన ఎలెక్టివ్ సబ్జెక్టులు, అడిషనల్ సబ్జెక్టులు, చీజజు= ప్యాటర్న్లో పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల సరఫరా, సీటింగ్ అలాట్మెంట్ విధానం గురించి వివరించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుండి వచ్చిన ా×ఐజు ప్రొఫెసర్ జె.వి.ఎస్.ఎస్. సుబ్రహ్మణ్యం ×ాజు-2026 పరీక్షల నూతన సంస్కరణలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి స్లైడ్ను చూపిస్తూ సవివరంగా వివరించారు.

ఈ అవగాహన సదస్సుకు ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లు, ఎంటీఎస్ సిబ్బంది, పీటీలు, కాంట్రాక్ట్ లెక్చరర్లు కలిపి సుమారు 210 మంది హాజరై, సదస్సు అత్యంత సంతృప్తికరంగా జరిగిందని వనరుల వ్యక్తి జె.వి.ఎస్.ఎస్. సుబ్రహ్మణ్యం తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా - ప్రజా దర్బార్

మొదటిపేజి తరువాయి

ముఖ్యమంత్రి సహాయ నిధి కోరుతూ, ఇళ్ల స్థలాలు, ఉద్యోగ అవకాశాలు, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డ్స్ తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయి. మంత్రి సుభాష్ స్వయంగా ఆర్జీలు పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులును ఆదేశించారు. కొంతమంది దివ్యాంగులు వేదిక వద్దకు రాలేని పరిస్థితి ఉండగా మంత్రి సుభాష్ స్వయంగా వారి వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేయడం జరుగుతుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,

ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతివారం రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో గ్రీవెన్స్ డే'గా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే విధంగా ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని, వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీ నమోదు చేసి, దాని పరిష్కారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటూ, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం జరుగుతుందని పేర్కొన్నారు.

రామచంద్రపురం రెవిన్యూ డివిజన్ యధాతథం

మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ రామచంద్రపురం రెవిన్యూ డివిజన్ రెండు మండలాలతో అయినా యధాతథంగా నిర్వహిస్తామని, అవకాశాన్ని బట్టి మరో రెండు మండలాలను రామచంద్రపురం డివిజన్లో చేర్చే విధంగా కృషి జరుగుతుందని మంత్రి వివరించారు. రెవిన్యూ డివిజన్ తరలిపోతుందంటూ వైసీపీ వాళ్లు విష ప్రచారం చేస్తున్నారన్నారు. చేతగాని రాజకీయాలు చేయడం తనకు తెలియదని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండడమే తన నైజమన్నారు. గత 18 నెలల కాలంలో రామచంద్రపురం నియోజవర్గానికి రూ.150 కోట్లు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశామని, రానున్న పుష్కరాలకు మరో 150 కోట్లు నిధులు రానున్నాయని వెల్లడించారు.జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వంలో కేటాయించిన ఇల్లు కేటాయింపులో అంతులేని అవినీతి జరిగిందని వాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ప్రజల అభీష్టం మేరకే పాలన సాగుతుందనన్నారు. ప్రజా దర్బార్లో వచ్చిన అర్జీలు అన్ని సత్వర పరిష్కారం అయ్యేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, మున్సిపల్ కమిషనర్ రాజు, గృహ నిర్మాణ శాఖ డిఈ రాంబాబు, విద్యుత్ శాఖ డిఈ రత్నాలరావు, తహసిల్దార్ బండి మృత్యుంజయరావు, వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, మండల ప్రజా పరిషత్, వివిధ శాఖల అధికారులు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, రామచంద్రపురం రూరల్ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, బిజెపి నాయకులు దూడల శంకర్ నారాయణ, మేడిశెట్టి శేషారావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం..అర్జీదాలకు భోజన సదుపాయం

మంత్రి సుభాష్ క్యాంపు కార్యాలయానికి వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున అర్జీదారులు తరలిరావడంతో మంత్రి సుభాష్ అర్జీదారులు ఇబ్బంది పడకుండా భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. అలాగే ముచ్చుమిల్లి యూపిహెచ్సి నుంచి వైద్య సిబ్బందితో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి ముందు ఉచితంగా అందించారు. ప్రజా దర్బార్ వేదిక దగ్గరకు రాలేని దివ్యాంగులను చూసి మంత్రి సుభాష్ స్వయంగా వారి దగ్గరికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని, అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొని తమ సేవలు అందించారు.

# అన్నవరం వ్రత పురోహితుల ‘దానాల’ దోపిడీ!

మొదటిపేజి తరువాయి



**భక్తుడి డిమాండ్లు:** ఆ ఏడుగురు వ్రత పురోహితులు భక్తులను ఫలితం దక్కాలంటే దానాలు చేయాలంటూ మూడు రకాల దానాలు పేర్లు చెప్పి ప్రలోభ పెట్టి భక్తుల నుంచి అదనపు వసూళ్లు చేయడం భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని

– కేవలం రూ 10,000 జరిమానా, మూడు నెలలు నిలిపివేయడం “ అంటే చిన్న తప్పిదంగా వదిలేసినట్టే అవుతుందని.

–తక్షణమే ఆ ఏడుగురు పురోహితులపై సస్పెన్షన్ వేటు వేయాలని.

–వ్రత పురోహితుల సేవల్లో అలసత్వాన్ని నివారించడానికి ‘క్రమశిక్షణ రిజిస్టర్’ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**కలెక్టర్ కార్యాలయం కీలక ఆదేశాలు:**భక్తుడి ఫిర్యాదు తీవ్రతను, మరియు విచారణలో నిరూపితమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని, జిల్లా కలెక్టర్ సి.షన్ మోహన్ తీవ్రంగా స్పందించారు. కలెక్టర్ కార్యాలయం ఉన్నతాధికారులు దేవస్థానం నూతన ఈవో, ఆర్జేసి వేంద్ర త్రినాధ రావుకు తక్షణమే కీలక ఆదేశాలు జారీ చేశారు. “సీసీటీవీ ఫుటేజ్ మరియు మైక్ వాయిస్ రికార్డింగ్లను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, వ్రత పురోహితులపై చట్టపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. ఆలయ పవిత్రత, పారదర్శకతకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించవద్దు,” అని కలెక్టర్ కార్యాలయ అధికారులు ఆదేశించినట్లు తెలుస్తోంది.గతంలో ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు పలువురు వ్రత పురోహితులపై సస్పెన్షన్ వేటు వేసిన దాఖలాలు ఉండగా, ప్రస్తుతం రుజువైన ఈ ‘దానాల దోపిడీ’ కేసులో ఏడుగురు పురోహితులపై సస్పెన్షన్ వేటు వేయకపోవడంలో అధికారులు కుమ్మెక్కైనట్టు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విషయంలో భక్తులు మనోభావాలు పరిగణనలోకి తీసుకుని దేవస్థానం పారదర్శ కతపై నూతన ఈవో నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కెఎంసి ముందడుగు

మొదటిపేజి తరువాయి

ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రతి ఫిర్యాదుదారుడితో మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా ఆలకించారు.

**70 ఫిర్యాదులపై తక్షణ సమీక్ష**

ఈ కార్యక్రమంలో మొత్తం 70 మంది అర్జీదారులు తమ సమస్యలను ఎమ్మెల్యే మరియు ఇంచార్జ్ కమిషనర్కు సమర్పించారు. వీటిలో ప్రధానంగా పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, తాగునీరు, పట్టణ ప్రణాళిక, పౌర సేవలకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. సమస్యల తీవ్రతను తెలుసుకున్న ఎమ్మెల్యే కొండబాబు ప్రతి ఫిర్యాదుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. “సమస్యల మూలకారణాలను గుర్తించి, అంతర్–శాఖల సమన్వయంతో పటిష్టమైన పరిష్కారం అందించాలి. పరిష్కారం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్ర స్థాయిలో అమలు జరిగేలా చూడాలి,” అని ఎమ్మెల్యే కొండబాబు స్పష్టం చేశారు.**ప్రజా పాలనలో జవాబుదారీతనం కీలకం**

ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, “ప్రజలకు చేరువయ్యే పరిపాలనా విధానమే నిజమైన సుపరిపాలనకు నిదర్శనం. ప్రజా పాలనలో జవాబుదారీతనం, పారదర్శకత పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు అత్యంత కీలకం,” అని ఉద్ఘాటించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యతాయుత పరిపాలనకు ఈ కార్యక్రమం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కే.శ్రీనివాస్, ఎస్ఈపీ వెంక ట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, డీసీపీ కృష్ణారావు, టీపీఆర్వో శైలజ, ఈఈ కనకారావు, ఏసీపీ శ్రీధర్, టిపిఎస్ రామ్మోహన్, విద్యుత్ శాఖ ఈఈ మరియు హౌసింగ్ అధికారులు సహా నగరపాలక సంస్థలోని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేవస్థానం పవిత్రతను కాపాడండి

మొదటిపేజి తరువాయి

విధులు నిర్వహించాలని ఆయన కోరారు.నూతన ఈఓగా త్రినాథరావు,కలెక్టర్కు ధన్యవాదాలు తెలియ జేసి, ఆయన సూచనల మేరకు దేవస్థానం అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు కట్టుబడి ఉంటామనితెలిపారు.అన్నవరం దేవస్థానం ఈఓగా అదనపు బాధ్యతలు స్వీకరించిన త్రినాథరావు...ఆలయ పురోగతికి, దేవాదాయశాఖ నిబంధనల అమలుకు కృషిచేస్తారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఇగ్నైట్ కోడింగ్ కాంటెస్ట్ -2025






**- కోడింగ్ పోటీలు విజేతలకు 2 లక్షల 50 వేల నగదు బహుమతి**
**- విద్యార్థులు కోడింగ్‌లో నైపుణ్యవంతులు కావాలి**
**: డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల విద్యార్థుల కోడింగ్ నైపుణ్యాలను వెలికి తీసి, ఉత్తమ కోడర్లుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల ఇన్నోవేషన్ సెంటర్లో " కోడింగ్ కాంటెస్ట్" -2025 నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు.ఆదిత్యడిగ్రీ కళాశాలల కోడింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ కాంటెస్ట్ జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన 250 మంది ఎంపిక కాబడిన ఉత్తమ కోడెర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి మాట్లాడుతూ అధునాతన సాంకేతిక రంగంలో కోడింగ్ కు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉందని అన్నారు. నూతన యాప్స్ డెవలప్ చేయడానికి, టెక్నికల్ సమస్యలను పరిష్కరించడానికి, నూతన ఆవిష్కరణలకు కోడింగ్ అవసరమని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉత్తమ కోడర్లుగా తయారు చేయడమే ప్రధాన ఉద్దేశం అని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆదిత్య యూనివర్సిటీ వైస్ ఛాన్సర్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు దీటుగా డిగ్రీ విద్యార్థులు ప్రస్తుత సాంకేతిక రంగంలో నిలబడాలంటే కోడింగ్ తప్పనిసరి అనే ఉద్దేశంతో విద్యార్థుల ఆకాంక్ష మరియు తల్లిదండ్రుల కలను నెరవేర్చాలనే దృఢ సంకల్పంతో ఆదిత్య డిగ్రీ కళాశాలలలో కోడింగ్ పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామనిఅన్నారు. ఈరోజు కోడింగ్ వల్లనే డిగ్రీ విద్యార్థులు సాఫ్ట్వేర్ రంగంలో ఉత్తమ అవకాశాలను పొందుతున్నారని తెలిపారు. కోడింగ్ కాంటెస్ట్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి, వారిని ప్రోత్సహించిన అధ్యాపకులకు మరియు తల్లిదండ్రులకు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన స్వీడన్ దేశానికి చెందిన ఎస్ఈబి బ్యాంక్ క్లౌడ్ ఇంజనీర్ కారుమంచి మహేష్ మాట్లాడుతూ ఐటీ రంగంలో ఉద్యోగాలు సాధించడానికి విద్యార్థులకు ఏ విధమైన నైపుణ్యాలు కావాలి, వచ్చిన ఉద్యోగంలో మరింత ప్రగతి సాధించడానికి కావలసిన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి కావలసిన మెలకువలను తెలిపారు.

ఈకాంటెస్ట్‌లో ఉత్తమ కోడర్లను అందించిన మొదటి మూడు కళాశాలలకు" ఇగ్నైట్ చాంపియన్షిప్" పేరుతో రోలింగ్ షీల్డ్ తో పాటు నగదు బహుమతులను అందించారు. వీటిలో ప్రథమ స్థానం సాధించిన కాకినాడ ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలకు 25,000, ద్వితీయ స్థానం సాధించిన విజయనగరం ఆదిత్య డిగ్రీ కళాశాలకు 15,000, తృతీయ స్థానం సాధించిన గోపాలపట్నం ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు10,000 నగదు బహుమతిని అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఒక్కో సంవత్సరం నుండి ముగ్గురు విజేతలను ఎంపిక చేసి విజేతలకు 7500,5000,2500 నగదు బహుమతులను అందించారు. అంతేకాకుండా ప్రతి కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు 750, 600, 500 రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందించారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను మరియు ప్రశంస పత్రాలను ముఖ్య అతిథి డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి చేతుల మీదుగా అందించారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కోడింగ్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కరుణ, బ్యూలా, వైస్ ప్రిన్సిపాల్స్ సి.సత్యనారాయణ, జి.నాగ శ్రీకాంత్, కోడింగ్ ట్రైనర్ రాజేష్ బాబు, ఐటీ మేనేజర్ కార్తీక్, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన స్వర్గీయ పొట్టి శ్రీరాములు ను తెలుగు ప్రజలంతా గుర్తుపెట్టుకునే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడ ˇవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతిని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్, ఎపీఓ జనరల్ డి.ఎన్.వి.రమణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 1901 సంవత్సరం మార్చి 16న నెల్లూరు జిల్లా పడమటిపల్లి గ్రామంలో జన్మించారన్నారు. 1952 సంవత్సరం డిసెంబర్ 15న మద్రాసులో తెలుగు ప్రజల కోసం ప్రత్యేక ఆంధ్ర కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారన్నారు. మద్రాసు ఉమ్మడి రాజధాని నుండి ప్రత్యేక ఆంధ్ర సాధన కోసం 1952 సంవత్సరం అక్టోబర్ 19న బులుసు సాంబమూర్తి నివాస గృహము నుండి నిరాహార దీక్ష ప్రారంభించారని ఆయన తెలిపారు. చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం పొట్టి శ్రీరాములు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని, అదేవిధంగా 1930 సంవత్సరంలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారని, అదేవిధంగా 1941, 1942 సంవత్సరంలో భారతదేశ ఉద్యమాలలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారన్నారు. ప్రత్యేక ఆంధ్ర కోసం ఉద్యమం చేసి తెలుగు ప్రజల కోసం ప్రత్యేక ఆంధ్ర సాధించిన పొట్టి శ్రీరాములును తెలుగు ప్రజలంతా గుర్తుపెట్టుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముందుగా పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా వివిధ శాఖల అధికారులు సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎడీఏలు సావిత్రి, రామ్మోహన్, పిహెచ్ఓ దేవదానం, జిసిసి డిఎం జయశ్రీ, పిఏఓ.ఎల్. రాంబాబు, అడిషనల్ డిఎం అండ హెచ్ ఓ డాక్టర్ సరిత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సుబ్బయ్య, బి.వి రమణ, తహసీల్దార్ పి. బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, సిడిపివోలు క్రాంతి కుమారి, ప్రత్యక్ష లక్ష్మి, కె.ఉమా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, పి.వెంకటరమణ, సుబ్బయ్య, భవాని, శివ, మల్లికార్జునరావు, ఏఎంఓ విజయ భాస్కర్, డాక్టర్ స్పందన, డాక్టర్ కేథరిన్, వెలుగు ఏపిడి దేగలయ్య, సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారిణి యం.సావిత్రి, డిప్యూటీ తహసిల్దార్లు స్వామి, రవీంద్రబాబు, త్రిమూర్తులు, శ్రీధర్, సూపర్డెంట్ బి.కిషోర్, సబ్ రిజిస్టర్ ఉపేంద్ర, పీఎంయు అధికారిని చంద్రకళ, ఉపాధి హామీ పథకం ఏపీవో బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

## యువత మేలుకో... గోడపత్రిక ఆవిష్కరణ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన 'హలో యువతా మేలుకో, చెడు వ్యసనాల నుంచి నిన్ను నువ్వు కాపాడుకో' కార్యక్రమం గోడపత్రికను జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో యువత మత్తు పదార్థాలకు బానిసలు కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి వంటి వాటిని అరికడుతున్నామని తెలిపారు. విద్యార్థులు, యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. మత్తు పదార్థాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యసనం నుంచి బయటపడాలనుకునే వారికి కౌన్సిలింగ్, వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ చొరవను ఆమె అభినందించారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలైన వారికి పోలీసుల సమక్షంలో ఉచిత కౌన్సిలింగ్, వైద్యం అందించడానికి ఏఐవైఎఫ్ సిద్ధంగా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. వీరబాబు, ప్రభు తేజ, సిద్ధు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నూనెగింజల పంటలపై అవగాహన



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, వాలుతిమ్మాపురం గ్రామం ఆర్ఎస్‌కె వద్ద సోమవారం షెడ్యూల్డ్ కులాల సబ్‌ప్లాన్‌లో భాగంగా నూనెగింజల పంటలపై అవగాహన కార్యక్రమం పెద్దాపురం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ సైనం బుల్లెమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడిఏ నల్లి దైవకుమార్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను పండించడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని నువ్వులు, వేరుశెనగలాంటి నూనె ఇచ్చే పంటల వల్ల రైతుకు అదనపు ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఇంజేటి సుధీర్ మాట్లాడుతూ నువ్వుల పంటలో వచ్చే పురుగులు, తెగుళ్ళపై అవగాహన కల్పించారు. డి.ఎ.ఎ.టి.సి. శాస్త్రవేత్త శర్మ రైతులకు నువ్వు పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సంజయ్ కుమార్, ఏఇఓ ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ సైనం సాల్మన్‌రాజు, గంగాధర్, ఐస్‌బాబు, పంచాయతీ సెక్రటరీ వెంకట్, వాలుతిమ్మాపురం, చినబ్రహ్మాదేవం రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 6 అర్జీలు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 6 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు.ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సంబ ంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.డ ˇబ్లూఓ. వాణి, డిఎల్‌పిఓ కార్యాలయ ఏఓ మైథిలి, హౌసింగ్ ఏఇ రవిశంకర్, ఇరిగేషన్ ఏఇ కుమార్, ఐసిడిఎస్ సిబ్బంది రమణమ్మ, హెచ్‌డబ్లూఓ శ్రీవల్లి, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



– రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ శిరీష దేవి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ద చూపిస్తుందని, మినీ అంగన్వాడి కేంద్రాల స్థాయి ప్రభుత్వం పెంచిందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే సేవలను మరింత పటిష్ఠంగా అమలుచేసే విధంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుం టుందని రంపచోడవరం ఎమ్మెల్యే,రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. రంపచోడవరం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో సోమవారం అంగన్వాడీ కార్యకర్తలకు చరవాణి లు పంపిణీ కార్యక్రమం ఐటిడిఎ పథక నిర్వహణ అధికారి బచ్చు స్మరణ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో అందించే సేవలను కూటమి ప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలు సౌలభ్యం రీత్యా వారికి అందించే ఆహారం, పూర్వ ప్రాథమిక విద్య విధానాలు సులభంగా అందించేందుకు విస్తృత స్థాయిలో కార్యకర్తలకు మరింత నైపుణ్యం కల్పిస్తుందన్నారు. వారికి అందించే ఆహారంలో కూడా పూర్తి నాణ్యతతో ఉండేలా చూస్తూ ప్రాథమిక విద్యకు సిద్ధం చేసే బాధ్యత కార్యకర్తలపై ఉందని సూచించారు. దీనిలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గంలో చింతూరు డివిజన్‌లోని 93 మినీ అంగన్వాడీ కేంద్రాలను అంగన్వాడీ కేంద్రాలుగా, రంపచోడవరం డివిజన్‌లోని 91 మినీ అంగన్వాడీ కేంద్రాలను అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు మంజూరు చేసినట్లు తెలిపారు. మరియు కార్యకర్తల కొరకు కేంద్రాల్లో అందించే సేవలపై ప్రతీరోజు సంబధిత ఉన్నత అధికారులకు అంతర్జాలంలో అందించే విధంగా చింతూరు డివిజన్‌లోని 432 మంది కార్యకర్తలకు, రంపచోడవరం డివిజన్‌లోని 582 మంది కార్యకర్తలకు శాంసంగ్ 5జి చరవాణీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓలు కె.ఉమ, సుజాత, పి.క్రాంతి కుమారి, సుచరిత ఆదిలక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన పరిరక్షణపై కేంద్రం స్పష్టీకరణ



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** 2023–24లో దేశవ్యా ప్తంగా గృహాలు, భవనాలు, పరిశ్రమలు, రవాణా, వ్యవసాయ రంగాల్లో అమలైన ఇంధన పరిరక్షణ పథకాల ద్వారా ఏటా 53.60 మిలియన్ టన్నుల చమురు సమాన ఇంధన పొదుపు సాధ్యమైందని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీపాద నాయక్ తెలిపారు. దీనివల్ల సుమారు రూ.2 లక్షల కోట్ల వ్యయ తగ్గింపు జరిగినట్లు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఈఈ) అంచనా వేసిందన్నారు. అయితే రాష్ట్రాలు లేదా జిల్లాల వారీగా ఇంధన పొదుపు వివరాలను బిఈఈ లెక్కించదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన పరిరక్షణ పథకాల అమలుపై రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. ఇంధన పరిరక్షణ భవన నియమావళి (ఈసీబీసీ) కనీసం 100 కిలోవాట్ల కనెక్టెడ్ లోడ్ లేదా 120 కేవీఏ కాంట్రాక్ట్ డిమాండ్ ఉన్న కొత్త భవనాలకు వర్తిస్తుందని తెలిపారు.

దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సుమారు 1,400 పట్టణ స్థానిక సంస్థలు ఈసీబీసీ ని స్వీకరించాయని, అయితే అనుగుణ భవనాల రాష్ట్ర/జిల్లా వారీ జాబితాను బిఈఈ నిర్వహించడం లేదన్నారు.

అలాగే ఉజాలా పథకం 2015లో ప్రారంభమై లక్ష్యాలు పూర్తయ్యాక 2019లో ముగిసిందని, ప్రస్తుతం ఈఈఎస్ఎల్ ఆన్‌లైన్ మరియు సంస్థాగత మార్గాల ద్వారా మాత్రమే లెడ్ బల్బుల విక్రయం కొనసాగుతోందని మంత్రి తెలిపారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు
# స్మారక చిత్రలేఖనం పోటీల బహుమతి ప్రధానోత్సవం



రావులపాలెం, మేజర్ న్యూస్ : పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సోమవారం శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘ భవనము నందు ఆర్యవైశ్య సంఘం, రావులపాలెం వారి ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం మరియు పొట్టి శ్రీరాములు స్మారక చిత్రలేఖనం పోటీల బహుమతి ప్రధానోత్సవం జరిగినది. ఆర్యవైశ్య సంఘ భవనము నందు గల పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ, రోశయ్య, మన్యం భాస్కర రావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు తో అర్పించినారు. తరువాత 7వ తరగతి లోపు వారిని జూనియర్స్ గాను, 8 9 10 తరగతి తరగతుల వారిని సీనియర్స్ కానీ విభజించి, "సంక్రాంతి పండుగ" అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా 20 హైస్కూల్స్ నుండి, 1100 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ బహుమతి ప్రధానోత్సమునకు ముఖ్యఅతిథిగా రావులపాలెం, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్య క్షులు, పోతంశెట్టి కనికిరెడ్డి విచ్చేసి విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేసినారు. ముఖ్యఅతిథి కనికిరెడ్డి మాట్లాడు తూ భాషా ప్రయుక్త రాష్ట్రాలకై అమరజీవి పొట్టి శ్రీరాములు వారి ప్రాణత్యాగం ఈ భూమి ఉన్నంతవరకు తెలుగువారు మరువని, ఆంధ్రుల గుండెల్లో ప్రాతస్మరణీయులుగా ఉంటారని, వారి త్యాగం అజరామరమని కొనియాడి నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు కంచర్ల మాణిక్యాలరావు, రావులపాలెం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మన్యం పర్వత వర్ధనరావు, కార్యదర్శి మండవల్లి నగేష్, ఉపాధ్యక్షులు కంకటాల నాని, సహ కార్యదర్శి కడించర్ల నాగరాజు, కోశాధికారి మండవల్లి చిట్టిబాబు, ఆర్యవైశ్య సంఘం పూర్వపు మండల అధ్యక్షులు యలమర్తి రామయ్య, సమయమంతుల హనుమంతరావు, మన్యం భాను, కంకటాల హరినాథ్, అత్యం లక్ష్మీనారాయణ, తుమ్మలపల్లి గోపాలకృష్ణమూర్తి, బోడా బాబు, మన్యం సూరిబాబు, కొల్లేపర నరసింహా మూర్తి, వెత్సా కృష్ణ, గాది సత్యనారాయణ, శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు కేశవరపు మాణిక్యం, కొల్లేపర లావణ్య, సమయమంతుల ఉష, యలమర్తి గౌరీ మొదలగు వారు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివి

– సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని రామచంద్రపురంలోని వాసవి కళ్యాణ మండపం ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ మహానుభావుడిని స్మరించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. త్యాగం,ధైర్యం, నిస్వార్థ సేవకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఒక ఉదాహరణగా నిలుస్తారని అన్నారు. ఆయన చిన్ననాటి నుంచే దేశభక్తి, సేవాభావం బలంగా నింపుకున్నారన్నారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై సత్యం, అహింస మార్గంలో నడిచారని, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, సమాజ సేవను తన జీవిత లక్ష్యంగా చేసుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్ర ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే కోరికతో ఆయన చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కోట్లాది ఆంధ్రుల ఆకాంక్షను గుండెల్లో పెట్టుకుని, 1952లో నిరాహార దీక్ష ప్రారంభించారన్నారు. 58 రోజులపాటు ఆహారం లేకుండా పోరాడి, చివరకు 1952 డిసెంబర్ 15న తన ప్రాణాలను అర్పించారు. ఆయన మరణం దేశాన్ని కదిలించింది. ఆ త్యాగ ఫలితంగానే 1953 లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. స్వార్థం లేని సేవ, ధైర్యంతో కూడిన పోరాటం, ప్రజల కోసం జీవించడం, పొట్టి శ్రీరాములు చూపిన మార్గంలో నడుద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు కంచుమర్తి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు మల్లాడి అభినందనలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌పిహెచ్‌సిఎల్) చైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాస రావు (కె.కె)మంగళగిరిలో పదవి ప్రమాణస్వీకారం చేశారు. కాకి నాడ జనసేన పార్టీ ప్రముఖ నాయకులు మల్లాడి రాజేంద్ర ప్రసాద్ మంగళగిరిలోని ప్రమాణ స్వీకార వేదిక వద్ద నూతన చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. మల్లాడి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కళ్యాణం శివ శ్రీనివాసరావు నిబద్ధత, కార్యదక్షత కలిగిన నాయకులు అన్నారు. ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన సేవలు రాష్ట్ర పోలీసు విభాగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** గుడ్ విల్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో సోమ వారం కాకినాడ రాజీవ్ గృహకల్ప ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పేదలందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు కళ్లజోడు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుడ్ విల్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ సంస్థ వ్యవస్థాపకులు తణుకులు యోహాను మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.రాజు, లాయర్ వీర్రాజు, కనకరాజు, ఫిలిప్, జోసఫ్, సుబ్రమణ్యం, వైద్యులు నవదుల్ హుస్సేన్, డాక్టర్ షాలీమ్ రోషన్, డాక్టర్ దాని జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి

**– మంత్రి కందుల దుర్గేష్**

**– సమిశ్రగూడెం ఎంపీడీవో కార్యాలయంలో నిడదవోలు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభించిన మంత్రి దుర్గేష్**



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** ప్రణాళికాబద్ధంగా నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. సోమవారం వేదమంత్రోచ్ఛరణల మధ్య మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా నిడదవోలు మండలం సమిశ్ర గూడెం ఎంపీడీవో ఆఫీస్ లో స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ అధ్యక్షుడుగా మంత్రి కందుల దుర్గేష్ వ్యవహరించనున్నారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ప్రణాళికా విభాగం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే నియమింపబడిన ఒక యంగ్ ప్రొఫెషనల్, గ్రామ సచివాలయాల నుండి ప్రత్యేకంగా ఎంపిక చేయబడ్డ 5 మంది ఉద్యోగులు వ్యవసాయం, ఆక్వా మరియు లైవ్ స్టాక్, పారిశ్రామిక, సేవారంగాలతో పాటు రియల్ టైం గవర్నెన్స్, పీ4 మరియు పబ్లిక్ ఇంటర్ఫేస్ కోఆర్డినేటర్లుగా పనిచేయనున్నారు. నియోజకవర్గ స్థాయి అభివృద్ధి ప్రణాళికల అమలుకు, సమన్వయానికి ఈ సీవీఏపీ యూనిట్ కీలక పాత్ర పోషించనుందని టీమ్ కి తెలుపుతూ పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడానికి, నియోజకవర్గ అభివృద్ధిపై అధ్యయనం చేసి అమలు చేసేందుకు ఇదొక చక్కని వేదికగా ఉపకరిస్తుందన్నారు. రాష్ట్రంలోని నియోజకవర్గాలకు ఇదొక నమూనాగా మారాలని టీమ్ కు సూచించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ అమలు లక్ష్యంగా పనిచేద్దామన్నారు. పీ4 లో భాగంగా రాష్ట్రంలో పేదరికం లేకుండా, అధిక ఆదాయం కలిగిన హెల్తీ, హ్యాపీ సమాజం లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి, నీటి భద్రత, లాజిస్టిక్స్, బ్రాండింగ్, డీప్ టెక్, పర్యావరణ పరిరక్షణ తదితర 10 ప్రధాన సూత్రాలు అమలు చేయాలని సూచించారు. పీ4ను విజయవంతంగా అమలు చేయాలన్నారు. బంగారు కుటుంబాలను, మార్గదర్శకులను వేగవంతంగా గుర్తించి పేదరికం లేని సమాజానికి బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన ఎంపిడివోలు, ఎంఆర్వోలు, ఎంపిటిసి, జెడ్పిటిసి సభ్యులు, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# 22 నెలలుగా మిస్సింగ్ మహిళ ఆచూకీ లభ్యం

**– బంధువులకు అప్పగింత**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ గర్ల్ మరియు వుమెన్ మిస్సింగ్ కేసుల్లో ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి ట్రేస్ చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో జగ్గంపేట సిఐ వైఆర్‌కె, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ 22 నెలలుగా కనిపించకుండా పోయిన ఒక మహిళ ఆచూకీ తెలుసుకుని, వారి బంధువులకు అప్పగించడం జరిగింది. వివరాలు ఇలా వున్నాయి. కిర్లంపూడి మండలము రాజుపాలెం గ్రామంనకు చెందిన 24 సంవత్సరముల వయసుగల వివాహిత అనామిక తన భర్త మీద ఇష్టం లేక 4వ తేదీ ఫిబ్రవరి నెల 2024వ సంవత్సరం ఇంటి నుండి కనిపించకుండా వెళ్ళిపోయి తనకు ఇష్టమైన వ్యక్తితో సహజీవనం చేస్తూ తన ఉనికి ఎవరికి తెలియకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుని సుమారు 22 నెలలుగా కనిపించకుండా ఉండటం జరిగింది. కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ క్రైమ్ మీటింగ్ లో ఇచ్చిన ఆదేశాల మేరకు జగ్గంపేట సిఐ వైఆర్‌కె, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ ఆమె బంధువుల ఇంటికి స్వయంగా వెళ్లి విచారణ చేస్తూ ఉండటంతో ఆమె చివరకు సోమవారం ట్రేస్ చేయడం జరిగింది. ఆమెను కిర్లంపూడి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరు పరచగా ఆమె తనకు ఇష్టమైన వ్యక్తితో వెళ్ళి పోయినట్టు అతనితో సహజీవనం చేయుచున్నట్టు, తాను తన ఇష్ట ప్రకారం వెళ్లినట్టు చెప్పినది. ఆమెను ఆమె బంధువులకు అప్పగించడం జరిగింది.

# రజక భవనంపై రజకుల హక్కు

**వనమాడి కొండబాబు చొరవతో సమస్యకు శాశ్వత పరిష్కారం!**

**దశాబ్దాల కల సాకారం కమ్యూనిటీ హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపు**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** దశాబ్దాలుగా రజక కమ్యూనిటీకి కేటాయించిన భవనం చివరకు వారికి దక్కింది. కాకినాడ నగరంలోని 44వ డివిజన్, శారదమ్మ గుడి సమీపంలో నిర్మించిన రజక కమ్యూనిటీ హాల్‌ను, స్థానిక సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు గారి అలుపెరుగని చొరవతో, రజక సంఘం సభ్యులకు అధికారికంగా అప్పగించారు. ఈ నిర్ణయంతో రజక సోదరుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. ఎన్నికల కార్యాలయంగా వినియోగంపై రజకుల ఆవేదన రజక కమ్యూనిటీ అవసరాల కోసం నిర్మించిన ఈ భవనం, నిర్మాణం పూర్తై ఏళ్లు గడుస్తున్నా, కార్పొరేషన్ అధికారులు దానిని ఎన్నికల కార్యాలయంగా వాడుతున్నారు. ఈ అన్యాయంపై రజక సంఘం నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీఎస్‌పీ) కార్యక్రమంలో, రజక సంఘం నేతలు, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సమక్షంలో ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణకు తమకు భవనాన్ని అప్పగించాలని వినతిపత్రం సమర్పించారు.

**ఎమ్మెల్యే కొండబాబు తక్షణ చర్య**

ప్రజల ఆకాంక్షను గుర్తించిన ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తక్షణమే స్పందించారు. పీఎస్‌పీ కార్యక్రమం ముగిసిన వెంటనే, రజక సంఘం నాయకులను వెంటబెట్టుకుని, ఇన్‌చార్జి కమిషనర్ సత్యనారాయణతో కలిసి కమ్యూనిటీ హాల్‌ను సందర్శించారు. ఎమ్మెల్యే చొరవతో వేగవంతమైన ప్రక్రియలో, రజక సంఘం నాయకులు భవనానికి రిబ్బన్ కట్టి వనమాడి కొండబాబు చేతుల మీదుగా దానిని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ రజక కమ్యూనిటీ హాల్‌ను ప్రతి ఒక్కరూ చక్కగా, సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. ఈ భవనం రజకుల పేరు మీద ఉన్నప్పటికీ, అన్ని వర్గాల ప్రజలు కూడా దీనిని ఉపయోగించుకోవాలని, సామాజిక ఐక్యతకు కృషి చేయాలని కోరారు.

కృతజ్ఞతగా సన్మానం

కమ్యూనిటీ హాల్‌ను రజకులకు అప్పగించడంలో కీలక పాత్ర పోషించిన సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు గారిని రజక సంఘం నాయకులు, పెద్దలు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. అలాగే, ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నగర అధ్యక్షులు మల్లిపూడి వీరును కూడా సభ్యులు సత్కరించారు.

ఈ ముఖ్య కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, టీడీపీ నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, రజక సంఘం నాయకులు బల్లంకి నూకరాజు, పిడుగు వెంకట రమణ, వీరబాబుమల్లి, కోరమంచెల సత్యనారాయణ, శీలం అప్పారావు, 44వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి బొల్లోజు ఉమామహేశ్వరరావు, డివిజన్ ప్రెసిడెంట్ బల్లంకి రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు అంకమ్మరెడ్డి రామునాయుడు, కలిదిండి సురేష్, బూత్ ఇన్‌చార్జి దార్ల సుబ్బారావు, జనరల్ సెక్రటరీ ముల్లేటి సత్తిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పుట్ట సతీష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకు న్నారు. ఆయన చిత్రపటానికి ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం, స్వీయ పరిపాలన కోరిక కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని, ఆయన చేసిన త్యాగం వల్లనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధ్యమైందని పేర్కొన్నారు. ఆయన త్యాగం భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడినదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పి.వి.ప్రసాద రావు, డిప్యూటీ ఎంపిడిఓ పి.వి.ఆర్.కె.రాజు, పరిపాలనాధికారి వి.రామ స్వరూప్, డిప్యూటీ ఎంపిడిఓ కె.రమేష్ బాబు, ఎపియం గంగాధర్, మండల పరిషత్ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రమణారావు సేవలు ప్రశంసనీయం



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఉప్పలగుప్తంపేద ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం ఇతర అవసరాల కోసం గుడ్ సీడ్ ఫౌండేషన్ స్థాపించి వారి సంక్షేమానికి పాటుపడుతున్న అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. రమణారావు పుట్టినరోజు వేడుకలను సోమవారం రమణారావు స్వగ్రామమైన చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేట లోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు కేక్‌ను ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, ప్రజా ప్రతినిధులు నాయకులు మధ్య రమణారావు సునీత దంపతులు కుటుంబ సభ్యులు కట్ చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలను నిర్వహించారు. దైవ సేవకులకు వికలాంగులకు నూతన వస్త్రాలను రమణారావు సునీత దంపతులు అందజేశారు. పుట్టినరోజు సందర్భంగా రమణారావు సునీత దంపతులను ప్రజా ప్రతినిధులు, నాయకులు అభిమానులను దుశ్శాలువాలు కప్పి గజమాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపిటిసిలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయం లో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు మరియు సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమం డిప్యూటీ ఎంపిడిఓ జి.శేఖం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు,సర్ధార్ వల్లభాయ్ పటేల్‌ల చిత్రపటాలకు డిప్యూటీ ఎంపిడిఓ జి.శేఖరరెడ్డి, జి.ఎస్.డబ్ల్యూ.ఎస్. డిప్యూటీ ఎంపిడిఓ శ్రీహ రిలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మహేష్, రాజు, రోజా, లీల,పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# సిటిజన్ జాతీయ డైరెక్టర్‌గా జె.ఎస్. ఏకగ్రీవ ఎన్నిక



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ హెూంశాఖ మాత్యులు అమిత్ షా నేతృత్వంలో ఏర్పాటైన మినిస్ట్రీ ఆఫ్ కోఆపరేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన జాతీయ స్థాయి సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలలో 11 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో కాకినాడకు చెందిన ఆంధ్ర బ్యాంకు విశ్రాంతి సీనియర్ అధికారి జే.సత్యనారాయణ (జెఎస్ఆర్) డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఆనందభారతి ఎదురుగా ఉన్న సిటిజన్ బ్యాంకు ప్రాంగణంలో అభినందన సభ ఘనంగా జరిగింది. జే.సత్యనారాయణ మాట్లాడుతూ సిటిజన్ ప్రగతికి తన వంతు సహాయ సహకారాలు పూర్తిగా అందిస్తానన్నారు. చైర్మన్‌గా ఎం.ఎస్.ఆర్.వి. ప్రసాద్, వైస్ చైర్మన్‌గా పి.ఆర్.వి.పి.ఎస్ రాజులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సత్యనారాయణ వివరించారు. ఈ ఎన్నికలు కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన విధంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా ఎన్నిక లను నిర్వహించడం జరిగిందని నామినేషన్ల స్వీకరణ మరియు స్క్రూటినీ ఎన్నికలు అన్ని ప్రశాంతంగా నిర్వహించి ఏకగ్రీవంగా పదకొండు మంది ఎన్నికైనట్లు ప్రకటించడం సిటిజన్ సొసైటీ యొక్క క్రమశిక్షణకు నిదర్శనంగా సత్యనారాయణ ప్రకటించారు. కాకినాడ బ్రాంచ్ 104 కోట్ల డిపాజిట్లతో 91 కోట్ల రుణాలతో మొత్తం 195 కోట్ల వ్యాపారం చేస్తోందని వివరించారు. ఆరు రాష్ట్రాలలో 43 శాఖలతో విజయవంతంగా సిటిజన్ పనిచేస్తుందని ఆయన చెప్పారు. మొత్తం 4900 కోట్లు వ్యాపారం చేస్తోందని, త్వరలో విజయవాడ ఆటోనగర్ లో నాలుగవ బ్రాంచ్ ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని సత్యనారాయణ వివరించారు. ఖాతాదారుల సేవింగ్స్ ఖాతాలో పెట్టుకున్న మొత్తానికి 6.50 వడ్డీలు అందిస్తున్నామని మరియు ఫిక్స్ డిపాజిట్లపై అత్యధికంగా 10 శాతం వడ్డీ అందిస్తున్నామని వివరించారు. ఆంధ్ర బ్యాంకు విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.నరేంద్ర కుమార్ సిటిజన్ బ్యాంక్ ఎండిగా వ్యవహరిస్తున్నారని, బ్యాంకు గణనీయమైన అభివృద్ధి సాధిస్తూ ఖాతాదారులు షేర్ హెూల్డర్స్‌లో నమ్మకాన్ని పెంపొందిస్తున్నామని చెప్పారు.

సిటీజన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆర్థికంగా బలమైన సొసైటీగా 400 కోట్ల పైబడి రిజర్వు కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరీష్ కుమార్, ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ అఫీషియల్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎన్ సత్యనారాయణ, అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.మూర్తి, కృష్ణమూర్తి, ఎఫ్‌సిఐ రిటైర్డ్ ఆఫీసర్ వెంకటరత్నం, ప్రముఖ వ్యాపారవేత్త కే.రామారావు, ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ ఏజీఎం కృష్ణమోహన్, కె.వి.రమణలు ప్రసంగించారు. కాకినాడ బ్రాంచ్ మేనేజర్ నాయుడు తొలిత స్వాగతం పలికారు. కౌశిక్, మూర్తి, ఫణీంద్ర,వర్మ,గోపాలకృష్ణ, రవి మరియు షేర్ హెూల్డర్స్, ఖాతాదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయండి

**- జనవరి 4వ తేదీ చలో విశాఖ**
**- కార్మికుల ఇంటి వద్ద జెండా ఆవిష్కరణ**

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) 18 వ అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరుగుతున్న మహాసభలు జయప్రదం కావాలని కాకినాడ రూరల్ కరప మండలం గొడ్డటిపాలెం గ్రామం సిఐటియు నాయకులు సవరపు నాగేశ్వరరావు జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు కాకినాడ రూరల్ కరప మండల గొడ్డటిపాలెం సిఐటియు నాయకులు సవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో మొదటిసారిగా విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18 అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని వాడవాడలా జెండాలు ఎగరవేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధంగా తెచ్చిన 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడానికి వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అఖిలభారత మహాసభల్లో దేశంలో పనిచేసే ప్రతి కార్మికులకి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, పెన్షన్ కార్మికుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల వ్యతిరేక విధానాలను పార్లమెంట్లో చర్చించి చట్టాలు చేస్తుందన్నారు. అంబానీ, ఆదాని ఇలాంటి సంస్థలకు రాయితీలు వేల ఎకరాలు భూములు కేటాయిస్తూ కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం



లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పనిగంటల పెంపుదలను చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం దారుణం అన్నారు. పని గంటలు పెంచుతూ మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం కోసం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు వ్యతిరేకంగా ఫిబ్రవరి నెలలో జరుగుతున్న దేశవ్యాప్త సభలో కార్మిక, కర్షక విద్యార్థి, యువజన, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 4వ తేదీన విశాఖ నగరం ఆర్కే బీచ్‌లో జరుగుతున్న భారీ బహిరంగ సభ ర్యాలీలో కార్మికులు ప్రజలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రి శ్రీను, ఉందుర్తి చిన్న వెంకటరావు, జె.సురేష్, జి.సత్యనారాయణ, కే.సుబ్బలక్ష్మి, పి.సత్యవతి, జే.శివ, వి.సత్తిబాబు, పి.వీరమ్మ, పి.సత్తిబాబు, పి.విజయ నందన్, ఎస్.వర్మ, యశ్వంత్ విక్రమ్, ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అధికారుల వ్యక్తిగత బాధ్యత తప్పనిసరి

**- జిల్లా స్థాయిలో 180 అర్జీలు స్వీకరించడం జరిగింది**
**- జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ మూర్తి**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలను ఎప్పటికప్పుడు సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు వ్యక్తిగత బాధ్యత వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ టి. సీతారామ మూర్తి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలకు పరిష్కార మార్గం చూపించడమే లక్ష్యంగా పనిచేస్తోందని, అందుకు అనుగుణంగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి స్థాయి జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని సూచించారు. అర్జీల పరిష్కారంపై ప్రజల అభిప్రాయాలను ఐవీఆర్ఎస్ ద్వారా ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయిలో సమీక్షిస్తున్నట్లు తెలిపారు. వివిధ శాఖల పనితీరును అంశాల ప్రాతిపదికన విశ్లేషణ చేసి, నిర్లక్ష్యం వహించినా లేదా సరైన సమాచారం ఇవ్వని అధికారులపై షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అర్జీల పరిష్కారానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ద్వారా మొత్తం 180 దరఖాస్తులు స్వీకరించడం



జరిగింది. అందులో రెవెన్యూ శాఖ 86, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు 50, హెూం శాఖకు 21, డి ఎల్ ఎస్ ఎ 2 , ఇతర శాఖలకు చెందిన 21 నమోదు కాగా వాటిలో వినియోగదారుల వ్యవహారాలు-ఆహారం-పౌర సరఫరాలు, శక్తి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్, జలవనరులు, వ్యవసాయం మరియు సహకారం, మహిళలు-పిల్లలు, దివ్యాంగుల, వ పరిశ్రమలు మరియు వాణిజ్యం, మానవ వనరులు (ఉన్నత విద్య), రవాణా-రోడ్లు-భవనాలు, సాంఘిక సంక్షేమ శాఖలకు చెందిన 21 అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు.

## రాజవొమ్మంగి శివాలయంకు భక్తులు తాకిడి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** తూర్పు ఏజెన్సీ ప్రాంతమైన రాజవొమ్మంగిలో పురాతన చరిత్ర కలిగిన శివాలయంకు సోమ వారం భక్తులు తాకిడి పెరిగింది. స్థానిక కొండపై వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఎంతో మహిమగల దైవం. కాగా కొన్ని దశాబ్దాల కాలం నుండి స్వామివారిని దర్శించుకోవాలంటే మెట్ల గుండా వెళ్లాల్సిందే. దీంతో వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందికరంగా ఉండేది. ఇటీవల గ్రామ సర్పంచ్ రమణి, ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు నేతృత్వంలో ఎంపీపీ నిధులు, పంచాయితీ నిధులతో సిసి రోడ్డు నిర్మించడం వల్ల నేరుగా వాహనాలు కొండపైకి వెళుతున్నాయి. దీంతో స్వామివారినిఅన్ని వర్గాల ప్రజలు దర్శించుకోవడానికి వీలైంది. ఈ క్రమంలో సోమవారం శివాలయం భక్తుల తాకిడితో దద్దరిల్లింది. హర హర మహాదేవ శంభో శంకర అంటూ ఓం నమశివాయ అనే పంచాక్షరి నామం భక్తులు జపించారు. ఆలయ పురోహితులు మహాదేవునికి పంచామృత అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలానే ప్రతి సోమవారం మధ్యాహ్నం స్వామి వారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శివాలయం వీధికి చెందిన గూటాల నూకాలమ్మ అనే పేద మహిళ అంతంతమాత్రంగా వస్తున్న విరాళాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంది. .

## పిఠాపురంలో ఈనెల 28న హిందూ సమ్మేళనం



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఈనెల 28వ తేదీన పిఠాపురంలో హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా... దేశ వ్యాప్తంగా జరుగుతున్న హిందూ సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా పిఠాపురంలో 28 డిసెంబర్ 2025 ఆదివారం ఉదయం 9.00లనుండి పిఠాపురం బైపాస్ రోడ్డు ఆనుకొని ఉన్న శ్రీ గోపాల బాబా ఆశ్రమం నందు, "హిందూ సమ్మేళనం " జరుగుతుందన్నారు.

హిందూ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని స్థానిక కుక్కుటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం నందు సోమవారం ఆవిష్కరించారు.

హిందూ బంధువులు అందరూ ఈ కార్యక్రమం నకు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

## కోట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమ వారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప హాజరై ఆసుపత్రిలో సమస్యల గురించి వైద్యులతో చర్చించారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ లేకపోవడం తో గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అలాగే పలు సమస్యలను ఎమ్మెల్యే రాజప్ప దృష్టికి తీసుకువచ్చారు.

దీనిపై రాజప్ప మాట్లాడుతూ గైనకాలజిస్ట్ ను వెంటనే నియమించాలని ఐజనూ ను ఫోన్ లో ఆదేశించారు.అలాగే సమస్యలను ఆయా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరి ంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడుగు శ్రీకాంత్,బలుసు వాసు,కంటే జగదీష్ మోహన్,కమిటీ సభ్యులు మలిరెడ్డి ప్రసాద్, జయలక్ష్మీ, చంద్రశేఖర్,దార్ల శ్రీను,అందుగులచక్రవర్తి,గోల్తి సత్య నారాయణ, మెండెం సరయ్య వైద్యులు పాల్గొన్నారు.

# భావితరాల కోసం ప్రతీ ఇంట్లో కరెంట్ ఆదా చేయాలి

**– ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీలో భావితరాల వారికి భరోసానిచ్చే విధంగా ప్రతీ ఇంట్లో కరెంట్ ఆదా చేయాలని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బచ్చు స్మరణ్ రాజ్ విజ్ఞప్తి చేసారు. సోమవారం స్థానిక ఐటీడీఏ ఆవరణలో ఇంధన పరిరక్షణ చిట్కాలు ర్యాలీని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంట్లో కరెంట్ ఆదా చేస్తే రానున్న తరాల వారికి భరోసా ఇవ్వచ్చునని అన్నారు. కరెంటు ఆదాతో కలిసొచ్చే ఉపయోగాలు చాలా ఉన్నాయన్నారు. ప్రతీ గ్రామంలో నేటి సత్సంకల్పం రేపటి వెలుగుల సాకారం అనే కార్యక్రమం ద్వారా కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. ప్రతి ఇంట్లో అవసరం లేనప్పుడు లైట్లు,ఫ్యాన్లు స్విచ్ ఆఫ్ చేసుకోవాలని, అదేవిధంగా ఇస్త్రీ పెట్టెలు, ఎయిర్ కూలర్స్, ఇకనుండి ఫ్రిజ్ కొనుక్కునేవారు ఆటోమెటిక్ ఫ్రిజ్ లు కొనుగోలు చేస్తే కరెంట్ ఆదా చేయవచ్చని, అదేవిధంగా కరెంట్ బిల్లులు తక్కువ వస్తాయన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేసుకోవాలన్నారు. ఏజెన్సీలో ఈనెల 14వ తేదీ నుండి ఈనెల 20వ తేదీ వరకు ఏడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ ఇంధన శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 18వ తేదీన రంపచోడవరం అంబేద్కర్ సెంటర్లో కళా జాత ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా కొన్ని ఇంటర్మీడియట్ కాలేజీలలో కరెంట్ పొదుపుపై ఈపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కరెంటు పొదుపు సందర్భంగా కొన్ని పాఠశాలల విద్యార్థులతో డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, డ్రాయింగ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు, అంబేద్కర్ సెంటర్ నుండి ఈపీఈపీడీసీఎల్ సుమారు 200 మంది సిబ్బందితో కరెంటు పొదుపు నినాదాలతో ర్యాలీ నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డి.ఎన్.వి.రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో బి. సత్యనారాయణ, ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బివి.రమణ, డిఈ మల్లికార్జునరావు, ఏఈలు శ్రీనివాసరావు, ఎన్.ఎస్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# శిక్షణ దిగ్విజయంగా పూర్తి చేయండి

**– జిల్లా ఎస్పీ బిందుమాధవ్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో ఎంపికైన అభ్యర్థులు డిసెంబర్ 22న ప్రారంభం కానున్న ప్రత్యేక శిక్షణను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సూచించారు. ఈ మేరకు అభ్యర్థులు, వారి తల్లిదండ్రులతో సోమవారం ఒక అవగాహన సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో శిక్షణ యొక్క ప్రాముఖ్యత, క్రమశిక్షణ, శారీరక, మానసిక సిద్ధత అంశాలపై ఎస్పీ స్పష్టమైన సూచనలు ఇచ్చారు. శిక్షణ సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, ప్రవర్తనా విధానం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో శిక్షణ పూర్తి చేసి, రాష్ట్రానికి మంచి సేవలందించాలని ప్రేరణ కల్పించారు. అనంతరం, మంగళగిరిలో నిర్వహించబడిన ముఖ్యమంత్రి సందేశ కార్యక్రమంకు హాజరయ్యేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాకినాడ నుండి 13 బస్సులలో సుమారు 200 మంది అభ్యర్థులను, 276 మంది తల్లిదండ్రులను సురక్షితంగా మంగళగిరికి పంపించారు.

# పొట్టి శ్రీరాములు త్యాగనిరతి ఎప్పటికీ చిరస్మరణీయం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మబలిదానం ఫలితంగానే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని, ఆయన త్యాగనిరతి తెలుగు ప్రజలకు ఎప్పటికీ చిరస్మరణీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు.

సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. అధికారులతో కలిసి పొట్టి శ్రీరా ములు చిత్రపటానికి పూలమాలలు అలంకరించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. స్వతం త్ర సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ మూలపురుషుడు పొట్టి శ్రీరాములు తెలుగువారందరికీ చిరస్మరణీయుడని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని కోరుతూ 48 రోజులపాటు కఠోర నిరాహార దీక్ష చేసి పొట్టి శ్రీరాములు అమరుల య్యారన్నారు. ఆయన పట్టుదల, మనోధైర్యం, త్యాగం ఫలితంగానే తెలుగు భాష మాట్లాడే ప్రజలందరికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని అయిన తెలిపారు. ఆదర్శనీయమైన ఆయన జీవిత విధానం అచంచల దీక్షా, పట్టుదలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జేసీ అపూర్వ భరత్



సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం.లల్లి, కలెక్టరేట్ ఏవో ఎస్ రామ్మోహన్ రావు, సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.జగన్నాథం, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

**– ఆర్డీఓ కె.శ్రీరమణి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలు అర్పించారని, ఆయన త్యాగం వల్లే ఆంధ్రరాష్ట్రం అవతరించిందని ఆర్డీఓ శ్రీరమణి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మాట్లాడుతూ దేశభక్తి, త్యాగానికి ఆయన ప్రతీక అని, తెలుగుజాతి చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుందని, ఆయన ఆశయాలు నేటికి ప్రేరణగా ఉన్నాయని ఆమె తెలిపారు. దీనికి ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డిటి భానుకుమార్, సిబ్బంది నారాయణ, ఆనంద్, ప్రకాష్, సిసి రమేష్ కుమార్, రాధ, ఆలీషా, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# బ్యారేజికి ముప్పు వాటిల్లుతున్న మత్స్యశాఖ జీవో రద్దు చేయాలి

**– రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ వినతి పత్రం**




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** గోదావరి బ్యారేజ్ మనుగడకు దెబ్బతీసే విధంగా జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం ఆత్రేయపురం తాసిల్దార్ కార్యాలయం వద్ద సంఘ జిల్లా కార్యదర్శి కొండా దుర్గారావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు డిప్యూటీ తాసిల్దార్ రామచంద్ర మూర్తికి వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి దుర్గారావు మాట్లాడుతూ గోదావరి బ్యారేజ్ దిగువ ప్రవాహపు నీటికి నష్టం చేసే మత్స్యశాఖ జిల్లా అధికారి పీవీ శ్రీనివాసరావు ఇచ్చిన సీడ్ సేకరణ ఉత్తర్వులు తక్షణం రద్దు చేయాలని, లీజు కొనసాగించడానికి ఫిషరీస్ డెవలప్మెంట్ అధికారి, వి డేవిడ్ రాజు 25 11 2025న ఇచ్చిన నోటీసు ఉపసంహరించాలని గోదావరి బ్యారేజ్ దిగువన గౌతమి, వైనతేయ, వశిష్ట, నదీ పాయలు ద్వారా, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు మరియు ఉమ్మడి కృష్ణ జిల్లాల్లో లక్షలాది ఎకరాలు భూములు సాగులో ఉన్నాయని, పంటలకు అవసరమైనప్పుడు నీటిని ఉపయోగించుకునే బ్యారేజీ ప్రయోజనానికి తూట్లు పొడుస్తూ, మత్స్య శాఖ జిల్లా అధికారి పీవీ శ్రీనివాసరావు, ధవళేశ్వరం బోట్స్ మెన్ సొసైటీకి, 2024లో రొయ్య సీడు సేకరణకు లీజు ఉత్తర్వులు ఇచ్చారని, దీనిని కొనసాగించడానికి ఫిషరీస్ డెవలప్మెంట్ అధికారి వి.డేవిడ్ రాజు తేదీ 25-11-2025న నోటీసు జారీ చేశారన్నారు. రొయ్య సీడ్ సేకరణకు అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వడం వల్ల బ్యారేజీ ప్రయోజనానికి నష్టం జరుగుతున్నదని, ఇరిగేషన్ హెడ్ వర్క్స్ అధికారులు, తేదీ 31 01 2025న జిల్లా కలెక్టర్ కు నివేదిక ఇచ్చినప్పటికీ, మత్స్య శాఖ అధికారులు తమ ప్రయత్నాలు మానుకోలేదని అన్నారు.

ధవలేశ్వరం బోట్స్‌మెన్ సొసైటీ వాళ్ళు 2011లో స్థానిక ఎస్సీ మత్స్యకారుల మీద దాడి చేశారని, ఈ కేసు నేటికి కోర్టు విచారణలో ఉందన్నారు. మత్స్యశాఖ అధికారుల లీజు ఉత్తర్వులు రద్దు చేయాలని, స్థానిక జల్లివారిపేట ఎస్సీ మత్స్యకారులకు ఫిషర్మెన్ సొసైటీ రిజిస్టర్ చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జల్దివారి పేట ఎస్సీ ఫిషర్మెన్ నాయకులు గోళ్ళ మోహనరావు, గోళ్ళ శ్రీహరి, జల్లి చక్రవర్తి రైతు–కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు, యార్లగడ్డ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంసద్ ఖేల్ మహోత్సవాలను విజయవంతం చేయాలి

**పెరవలి మండల స్పెషల్ ఆఫీసర్ సునీల్ వినయ్**



**పెరవలి, మేజర్ న్యూస్ :** సంసద్ ఖేల్ మహోత్సవాలు పురస్కరించుకొని డిసెంబర్ 17 వ తేదీ,18వ తేదీలలో పెరవలి మండలం ఖండవల్లి జడ్పీ హైస్కూల్ నందు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యొక్క బాల బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల స్పెషల్ ఆఫీసర్ ఎం సునీల్ తెలియజేశారు. డిసెంబర్ 15వ తేదీ మేజర్ న్యూస్‌తో మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురంధరేశ్వరి ఆదేశాల మేరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు,కోకో కబాడీ వాలీబాల్ యోగ, 800 మీటర్ల పరుగు, త్రో బాల్, షాట్ పుట్ బాలికలకు 400 మీటర్లు పరుగు పందెం, షాట్ పుట్ లాంగ్ జంప్ విజేతలను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపబడునని తెలిపారు. మరిన్ని వివరాలు కోసం ఖండవల్లి హై స్కూల్ పిడి పల్లపు రాజు : 9704338448ను సంప్రదించవలసినదిగా ఎంపీడీవో కేయుఆర్ఎల్ పద్మజ మరియు ఎంఈఓ -1 బిబిఎస్ స్వరూప్, ఎంఈఓ -2 షేక్ సూర్జన్ తెలియజేశారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాతః స్మరణీయులు

**– మంత్రి కందుల దుర్గేష్**
**– విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన "అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి ఆత్మార్పణ దినం" కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్**



**పెరవలి,మేజర్‌న్యూస్ :** దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు నాంది పలికారని, ఆయన త్యాగనిరతి వల్లే ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పాటయిందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన "అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి ఆత్మార్పణ దినం – భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావం " కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొనగా ఆ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ సహచర మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నాడు ఉమ్మడి రాష్ట్రాలు ప్రెసిడెన్సీలుగా ఉన్న సమయంలో, భాషకు సంబంధం లేకుండా తెలుగువారు రెండవ పౌరులుగా పరిగణించబడిన నేపథ్యంలో 58 రోజులపాటు నిరవధిక నిరాహార దీక్ష చేసి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసుకున్నారని అన్నారు. అనంతరం ప్రత్యేక భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు ద్వారా దేశంలో వినూత్న మార్పుకు ఆయన మరణం నాంది పలికిందన్నారు. కేవలం భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటులోనే కాదు, మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపుమేరకు భారత స్వాతంత్ర సమరంలో పాల్గొనడం జరిగిందని, ఊరు వాడ తిరిగి దళిత జనోద్ధరణకు కృషి చేశారని వివరించారు. ఈ క్రమంలో అనేక పర్యాయాలు నిరవధిక నిరాహార దీక్షలు చేయడంతో పాటు పలుమార్లు జైలుకు వెళ్లడం జరిగిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని గుర్తించి, ఆయన స్ఫూర్తిని నేటితరానికి తెలియ జేయాలన్నసదుద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్,విద్యాశాఖమంత్రి నారాలోకేష్‌లు అమరావతిలో 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములువిగ్రహంఏర్పాటుకు నిర్ణయించార న్నారు. అంతే కాదు పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసుకున్న డిసెంబర్ 15 ను ఆత్మార్పణ దినంగా నిర్వహించాలని, తద్వారా దేశం, జాతి,రాష్ట్రం కోసం ఆయన కష్టపడిన తత్వాన్నిభావితరాలకు అందించాలని క్యాబినెట్లో నిర్ణయిం చారని తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాతః స్మరణీయులు అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని, జాతి పునర్నిర్మాణం కోసం పునరంకితం అవుదామని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ సమాజానికి పిలుపునిచ్చారు.

# ఐటీడీఏ గ్రీవెన్స్‌లో సమస్యలపై వినతులు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ఐటిడిఏ సమావేశపు హాలులో వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ శుభం నోకాల్, సబ్ కలెక్టర్ సాహిత్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏపీఓ జనరల్ డి.ఎన్.వి.రమణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ఈ వారం సుమారు 86 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు.

రంపచోడవరం మండలం కాకవాడ గ్రామం నుండి ఆకూరు గ్రామం వరకు సుమారు 13 కిలోమీటర్ల రహదారికి ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరై రోడ్ ఏర్పాటు చేస్తున్నారని, ఈ రోడ్డును ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు మధ్యలో ఆపుతున్నారని, వెంటనే స్పందించి ఈ రోడ్డు పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడాలని కత్తుల రామకృష్ణారెడ్డి, సూంద్రు అబ్బాయి రెడ్డి, జి.చిన్నారావు దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం వేములకొండ గ్రామంలోని రెవిన్యూ భూములలో శతాబ్దాల కాలం నుండి వ్యవసాయం తీసుకుంటున్న 112 మందికి గిరిజనులకు సుమారు 356 ఎకరాలకు పట్టాలు మంజూరు చేయాలని అరగటి రామకృష్ణారెడ్డి, జి.చిన్నారావు, సాధన ప్రసాద్ రెడ్డి దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం బి వెలమల కోట గ్రామంలో మహిళా సంఘాలకు సంబంధించిన భవన నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయని, వెంటనే భవన పనులు పూర్తి చేయాలని, అదేవిధంగా పెద్ద బీరంపల్లి గ్రామానికి చెందిన కోసు వెంకటలక్ష్మి పూర్తిగా వికలాంగురాలని వికలాంగుల పింఛను మంజూరు చేయాలని బి.వెలమల కోట సర్పంచ్ వంతల అత్యాయమ్మ దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి గ్రామం నుండి కొత్తపాకలు గ్రామం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల రహదారి ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కొత్తపాలెం గ్రామంలో త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, స్కూల్ ఏర్పాటు చేయాలని మా గ్రామానికి కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయాలని వంతల రామారావు, విజ్జపు శివ, వంతల సాయి దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 100% బాలల సురక్షిత జిల్లాగా కాకినాడ జిల్లా




**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** పడాల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా కాకినాడ జిల్లా వారి సహకారంతో నిర్వహించినటువంటి బాలికల రక్షణ, హక్కుల చట్టం , లైంగిక వేదింపులు, పోక్సో యాక్ట్ ట్రైనింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి ఎంపిడిఓ కర్రి హరి కృష్ణ సత్య రెడ్డి మాట్లాడుతూ పసి పిల్లలపై లైంగిక వేధింపులు నివారించే దిశగా పడాల ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ కార్యక్రమం కాకినాడ జిల్లాలో ఉన్న అన్నీ డిపార్ట్మెంట్ ఎబ అమలు జరుగుతుంది. అంతే కాకుండా ఇది పేరెంట్స్ కూడా చేరువయ్యేలా ప్రణాళికలు రూపొంది స్తున్నాము అని చెప్పడం జరిగింది. పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా పిల్లల సంరక్షణ కోసం PCT పనిచేయడం గర్వంగా ఉంది అని తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా అందరికి ట్రైనింగ్ ఇచ్చినందుకు చాలా సంతోషంగా వుంది అన్నారు. ప్రైవేట్ పార్ట్స్, సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, సేఫ్టీ రూల్స్, పోక్సో చాప్, ఇంటర్నెట్ సేఫ్టీ వంటి విషయాలు పర్సనల్ సేఫ్టీ ఎడ్యుకేషన్ అనే మాడ్యూల్ ద్వారా అవగాహన కల్పించడం ద్వారా చిన్న వయసు లోనే లైంగిక వేధింపుల గురించి తెలుసుకోవడం, వాటి నుంచి తప్పించు కోవడం, పోక్సో చట్టం ద్వారా రిపోర్ట్ చేయడం వంటి చాలా కీలక మైన అంశాలు పిల్లలు నేర్చుకుంటారు. ఈ కార్యక్రమం ప్రతీ డిపార్ట్మెంట్ వాళ్ళ పరిధిలో గ్రామ స్థాయిలో కూడా విస్తృతంగా ప్రచారం చేయాల్సిందిన అవసరం ఎంతైనా వుందని తద్వారా కాకినాడ జిల్లా 100% చైల్డ్ సేఫ్ జిల్లాగా తయారు చేయడమే కాకుండా , పిల్లలపై లైంగిక వేదింపులు పూర్తిగా నివారించాలి అన్నదే ధ్యేయం అని లిపడాల చారిటబుల్ ట్రస్ట్ Administration Director K.Srinivas చెప్పడం జరిగింది. గత 3 సం.లో ఈ కార్యక్రమం ద్వారా సుమారు 500 స్కూల్స్‌లో ఉన్న 50,000 మంది పిల్లలను చేరుకోవడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఉన్నారు.

## ఘనంగా కాకినాడ యుఐడిఎఐ ఆధార్ సేవ కేంద్ర పునఃప్రారంభం



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయం ఎదురుగాగల స్వయంగా యుఐడిఎఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఆధార్ సేవ కేంద్రం నూతన సాంకేతిక హంగులతో సోమవారం ఉదయం చిన్నారులచే, ఆధార్ సేవల వినియోగదారుల సమక్షంలో పునః ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా యుఐడిఎఐ హైద్రాబాద్ ప్రాజెక్టు మేనేజర్ షేక్ జావీద్ విచేశారు, ప్రారంభోత్సవం అనంతరం, కాకినాడ యుఐడిఎఐ ఆధార్ సేవ కేంద్రం మేనేజర్ కె.శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ ప్రజలకు ఆధార్ సంబంధిత సేవలను మరింత సులభతరంగా చేరువ చేసే ఉద్దేశంతో, ఆధార్ సేవ కేంద్రం నందు సాంకేతికతను పునరుద్ధికరించేందుకు గత నెల 27వ తేదీ అనగా 27-11-2025వ తేదీ నుండి 14-12-2015 వరకు మూసివేయడం జరిగిందని, మరళ నూతన సాంకేతికతతో 15-12-2025వ తేదీన సేవలను పునః ప్రారంభించడం చాలా సంతోషం కలిగించిందని, ప్రజలందరూ తన ఆధార్ సేవ కేంద్రంకి విచ్చేసి,ఈ అవకాశన్ని సద్వినియోగపరచుకొని, వారి వారి ఆధార్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఆధార్ సేవ కేంద్ర ఆపరేషన్స్ మేనేజర్ శశిధర్ కుమార్, సాయి, భాస్కర్, మరియు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## బివిసి ఇంజనీరింగ్ కాలేజీలో అధ్యాపక శిక్షణా శిబిరము

**– మూడు రోజులపాటు నిర్వహణ**



**అల్లవరం,మేజర్‌న్యూస్ :** ఓడలరేవు స్థానిక బివిసిఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మోడ్రన్ వెబ్ డెవలప్మెంట్ -ఏఐ ఇంటిగ్రేషన్ అంశంపై ఏపీఎస్ఎస్‌డిసి, ఎడ్యునెట్ ఆధ్వర్యంలో శిక్షణా శిబిరం ప్రారంభించబడింది. ఈ శిబిరంలో శశాంక్ శేఖర్, ఎక్స్టెక్ట్ ట్రైనర్ శ్రీపతి హరికృష్ణ ప్రధాన వక్తలుగా వ్యవహరించారు. ఈ సభకు 102 మంది అధ్యాపకులు వివిధ కళాశాలల నుంచి హాజరయ్యారు. ఈశిబిరం మూడురోజుల్లో పాటు నిర్వహించ బడుతుందని కోఆర్డినేటర్ రాజశేఖర్ తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మహేశ్వర మాటాడుతూ ఈ శిబిరం సాంప్రదాయ విద్యా బోధన పద్ధతు లకు, ఆధునాతన సాంకేతిక విద్యా విధానాలకు వారధిలా పని చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్ పర్సన్ డాక్టర్ బోనం కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ఏ.ప్రవీణ్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏ.వై.ఆర్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

## చింతారావుకు ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్ ఆర్థిక సహాయం



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైన పాశం చింతారావు యాదవ్‌కు రావులపాలెం ఎల్ఐసి ఏజెంట్లు యూనియన్ ఆర్థిక సహాయం అందించింది. కుడిచేతి కాలర్‌బోన్ విరిగిపోవడంతో ఆయన ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా రావులపాలెం ఎల్ఐసి ఏజెంట్లు అసోసియేషన్ అధ్యక్షుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాయుడు వెంకట్రావు ఆధ్వర్యంలో ఎల్ఐసి ఏజెంట్లు చింతారావును పరామర్శించారు. అనంతరం ఆయనకు రూ.5,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెరవలి వెంకటేశ్వరరావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ డి.ఆర్.కె.రాజు, ట్రెజర్ సూరంపూడి శ్రీనివాసరావు, సీనియర్ ఏజెంట్ గంధం నరసింహమూర్తి, పలువురు ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

# సమాన పనికి సమాన వేతనంకై రంగరాయ ఔట్‌సోర్సింగ్ కార్మికుల పోరాటం!




**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్ ఔట్‌సోర్సింగ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ద్వితీయ మహాసభ సోమవారం సాయంత్రం అత్యంత ఉత్సాహంగా జరిగింది. సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో జరిగిన ఈ మహాసభలో కార్మికులు తమ హక్కులకై పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. సాంబమూర్తి నగర్, రెవెన్యూ కాలనీ రోడ్డులోని పి.ఆర్ భవన్‌లో వనమాడి కాటవేణి అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఒకే పనికి భిన్న వేతనాలు తగదు : తోకల ప్రసాద్

ఈ సందర్భంగా తోకల ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, వైద్య విధాన, ఏరియా, పి.హెచ్.సి, సి.హెచ్.సి, మెడికల్ కాలేజీలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనాలు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మెయిన్ డిమాండ్స్ .. అన్ని చోట్లా పని విధానం, సమయం ఒకటే అయినప్పటికీ, కార్మికుల శ్రమను దోచుకుంటూ వేతనాల్లో వ్యత్యాసాలు చూపడం సరికాదు. ప్రభుత్వ అధికారులు, మంత్రుల సమక్షంలో జరిగిన ఒప్పందం, 138వ జీవో ప్రకారం శానిటేషన్, సెక్యూరిటీ,పేస్ట్ కంట్రోల్ కార్మికులకు రూ.18,600 మంజూరు చేయాలి. కమిషన్లు, ఈపీఎఫ్, ఈఎస్ఐ మినహాయించిన తర్వాత కనీసం రూ.14,000 వేతనం అందించాలి.

ప్రస్తుతం కాకినాడ జిజిహెచ్‌లో రూ.13,960 మంజూరు చేస్తూ చేతికి రూ.8,000 మాత్రమే ఇస్తున్నారు. జీవో అమలు కేవలం జిజిహెచ్ లో తప్ప ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఒకే విధంగా వేతనాలు అమలు చేయాలి.ప్రతి కార్మికుడి శ్రేయస్సు కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని, జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించలేని పక్షంలో సంఘం అండగా ఉంటుందని ప్రసాద్ హామీ ఇచ్చారు. రంగరాయ మెడికల్ కాలేజ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్‌ను 2021లో ఏర్పాటు చేశామని, ఇది రెండవ ద్వితీయ మహాసభ అని ఆయన గుర్తుచేశారు.

**మున్సిపల్ యూనియన్ సంఘీభావం..**మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తరపున బొబ్బిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ రంగరాయ మెడికల్ కాలేజ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్‌కు అభినందనలు తెలియజేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ పూర్తి మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నమ్మి బాలకృష్ణ, కాటవేని, శివకుమార్, మోహన్, రామలక్ష్మి, సత్య, ఆంటోనీ రామారావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకానికి నిధుల పెంపు హర్షణీయం



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** గ్రామాలలో సామాజిక,ఆర్థిక మార్పు జరగాలని ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయించడం పట్ల మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 2005లో ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టగా మన రాష్ట్రంలో మాత్రం 2008 నుండి అమలులోకి వచ్చిందన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టం... ప్రజలకు ఉపాధి కల్పించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్‌శాఖ చేపట్టి ఈ పథకం అమలును ప్రతిష్టాత్మంగా తీసుకున్నారని అన్నారు. ఈ పథకం అమలులో అవినీతిని రూపుమాపడానికి పలు చర్యలకు శ్రీకారం చుట్టారని అన్నారు. గ్రామాలలో మరింత పారదర్శకత, జవాబిదారితనం పెంచడానికి గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులు సూచించిన పనులను ఒక పండుగ వాతావరణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపటా ్టరని అన్నారు. 2024 –25 ఆర్థిక సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా ఈ పథకం అమలుకు కేంద్రం రూ.86 వేల కోట్లు కేటాయి ంచిందన్నారు.ఈఏడాది బడ్జెట్లో కూడా అదే మొత్తాన్ని కేటాయించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వెన్నుముకగా నిలుస్తున్న ఈ పథకానికి నిధులు పెంచాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిని పవన్ కళ్యాణ్ స్వయంగా కలిసి కోరడం జరిగిందన్నారు. సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి గాను ఈ పథకానికి నిధులు పెంచాలని, పని దినాల సంఖ్యను కూడా పెంచాలని కోరడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం పేరుస్తానే 'పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన'గా పేరు మార్చడం, పని దినాల సంఖ్యను 125 రోజులకు పెంచడం అభినందనీయమని అన్నారు. ఈ పథకం అమలుకు 1.51 లక్షల కోట్లు కేటాయించడం హర్షణీయమని అడబాల తెలిపారు.

# సీఆర్ఎం టీచర్ల ఆందోళన

**– మినిమం టైమ్ స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్**





**కాకినాడ / సామర్లకోట, మేజర్ న్యూస్ :** యునైటెడ్ సిఆర్ఎంటి ఫోరం ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్స్ ఆందోళన చేపట్టి అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ కి వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఎలిపే రాంజీ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు తరాల మీరా సాహెబ్, కోశాధికారులు డి.స్వర్ణసుధ, ఎం.నాగలక్ష్మి మాట్లాడుతూ గత 11 ఏళ్ల నుండి అనేక సమస్యలతో సతమతమవుతూ విద్యా శాఖలో సిఆర్ఎంటిలు పనిచేస్తు న్నారని, గత ఆరేళ్ళ నుండి వేతనాలు పెంచకపోతే కుటుంబాలను ఎలా పోషించాలని ప్రశ్నించారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న సిఆర్ఎంటి లను విద్యా శాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. బి.క్లస్టర్ పేరుతో ఉన్నవారికి పనిని పెంచి, మిగిలిపోయిన ఉద్యోగులను దూర ప్రాంతాలకు బదిలీలు ఆపాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు.

పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేసి, సిఆర్ఎంటిలను రెగ్యులర్ చేయాలని కోరారు. టెట్ ద్వారా క్వాలిఫై అయ్యి, సెలక్షన్ కమిటీ ద్వారా ఉద్యోగాలలోకి వచ్చిన సిఆర్ఎంటిలకు డీఎస్సీలో వెయిటేజ్ ఇవ్వాలని, పిఆర్సి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 22న విజయవాడ ఎస్.పి.డి కార్యాలయం వద్ద భారీగా సిఆర్ఎంటిలు తరలివచ్చి డిమాండ్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషాబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, యూటీఫ్ నాయకులు గిరి, నాగరాజు, గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చేకూరి రవి, ఎస్టియు మణికంఠ, శ్రీకాంత్, శ్రీనివాస్, సంఘం నాయకులు పిఆర్టియు సంఘం నాయకులు చామంతి నాగేశ్వరరావు, ఏ.జి.వి.సుబ్బరావు, ఎ.ఎల్.ఎస్.సి నాగేశ్వరరావు, రాంబాబు, మండల కో ఆర్డినెటర్లు డిజె. డానియెల్, శ్రీనివాస్, ప్రసాద్, శ్రీనివాస్, రాజాబాబు, రాజుబాబు, భాషా తదితరులు పాల్గొన్నారు.

# 108లో ప్రసవం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని బొబ్బర్లంక గ్రామానికి చెందిన పి.విజయ దుర్గ అనే మహిళ ప్రసవ వేదన పడుతుండగా కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే అంబులెన్స్ టెక్నీషియన్ నాగాబత్తుల రవి శేఖర్, పైలట్ ఆనందరావు లు హుటాహుటిన చేరుకుని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో టెక్నీషియన్ శేఖర్ పురుడు పోశారు. ఆడపిల్ల జన్మించింది. తల్లి –బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వీరిని అభినందించారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు ముఖ్య అతిథులుగా హాజరై పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్త కొండబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని భాష ప్రయుక్త రాష్ట్రాల కోసం పాటుపడిన వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. కూటమి ప్రభుత్వం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి మనం ఏర్పాటు చేసి 58 అడుగుల కాంస్య విగ్రహం కూడా రాష్ట్ర రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయడం జరుగుతుందని వాసవి మాత ఆత్మార్పణ దినాన్ని అధికారిక కార్యక్రమంగా ప్రకటించిన వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.వాసవి డిస్టిక్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, బోండా వీర సత్య, బోండా నూకబాబు, కొత్త శ్రీరామకృష్ణ, కంచర్ల శ్రీను, చిత్రపు బాబు, వి నాగసత్య, బి జగన్ (బంక్), ఎస్ వెంకన్న బాబు, ఎం రామానుజ, పొట్టి రాజేష్, నిట్టల శ్రీనివాస్, ఉదయగిరి తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

## వాసిరెడ్డి సీతాదేవి 92వ జయంతి వేడుకలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** ముక్కామల శ్రీ ఇనప కోళ్ల రాఘవరావు మెమోరియల్ శాఖా గ్రంధాలయంలో డిసెంబర్ 15వ తేదీ సోమవారం శ్రీమతి వాసిరెడ్డి సీతాదేవి 92వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతాదేవి చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు కొంపెల్ల పట్టాభిరామం, కరటూరి కామేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంపెల్ల పట్టాభి రామం మాట్లాడుతూ సీతాదేవి తెలుగు నవలా రచయిత్రి అని ఈమె రచించిన నవలలు ఎంతో ప్రాచుర్యం పొందినవని అని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేయడం జరిగింది.

# తెలుగుదేశం పార్టీ గూటికి చేరిన వైసీపీ నాయకులు

**– పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం**




**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలోని 18, 19 వార్డుల్లోని రెడ్డి సురేష్, రెడ్డి సత్యనారాయణ, తిరుకోటి నాగబాబు, పోతా వత్తుల శ్రీను, యనమదల లోకేష్, గుత్తుల గణేష్, కుడుపూడి కొండబాబు, యనమదల దుర్గాప్రసాద్, తోట కృష్ణ, వాసంశెట్టి కృష్ణమోహన్, షేక్ లాల్సా, అంబేద్కర్, అశోక్, రమేష్ తదితరులతోపాటు మరో 90 మంది వైసీపీ నాయకులు, కె.గంగవరం మండలంలోని కూళ్ళ గ్రామానికి చెందిన పల్లి వీరేంద్ర, పలివెల శ్రీనివాసరావు, మల్లిడి ప్రేమ్ కుమార్, ఈరెళ్ళ వెంకన్న, పల్లి చిన్న, పల్లి మల్లేష్ ఆధ్వర్యంలో 130 మంది వైఎస్ఆర్సిపి, నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ చేరికలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని మంత్రి సుభాష్ తెలుగుదేశం పార్టీ కండువాను కప్పి సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో దివాళ తీసింది అని, ఆ నష్టాలను పూరించి రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో రాజీ పడకుండా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. పార్టీలో చేరిన వారంతా క్రమశిక్షణ, ఐకమత్యంతో మిగిలిన నాయకులను కలుపుకొని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవిల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, దంగేటి గౌరీ శంకర్, వాసంశెట్టి బాల, ఓబులనేని లక్ష్మణరావు (బాబు)కవల నానాజీ, కూళ్ల ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, కాటే సుబ్రహ్మణ్యం పలువురు కూటమి పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు. సీఎం చంద్రబాబు విజన్, మంత్రి సుభాష్ పనితీరు బాగా నచ్చింది రామచంద్రపురం నియోజవర్గంలో మంత్రి సుభాష్ పరిపాలన దక్షత, సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరినట్లు కూళ్ళ, రామచంద్రపురం నాయకులు వెల్లడించారు. వైసీపీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సరైన గుర్తింపు, గౌరవం లేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ పనితీరు తమను ఆకట్టుకున్నాయని, ఇకనుంచి మంత్రి సుభాష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కోసం పని చేస్తామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు.

# నల్లరాయి క్వారీలను మూసివేయాలని ఆందోళన




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఓజబందలోని నల్లరాయి క్వారీలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గిరిజనులు ఆందోళన చేసారు. ఏజెన్సీ ప్రాంతంలో మైనింగ్ వల్ల ఆదివాసులు నష్టపోతున్నారన్నారు. అలాగే దిరిసినపల్లి గ్రామ బహిష్కరణపై కేసు ఎందుకు నమోదు చేయడం లేదు? అని ప్రశ్నించారు. రంపచోడవరం ఎమ్మార్వో, మైనింగ్ ఏడి పాడేరుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఐటిడిఏ ఎదుట నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్ లో ఐటిడిఏ పిఓ, సబ్ కలెక్టర్‌కు గంగవరం మండలం ఓజుబంద గ్రామంలోని ప్రజలకు హానికరంగా ఉన్న నల్లరాయి కార్యాలను తక్షణమే మూసివేయాలని కోరుతూ ఫిర్యాదు చేయడం జరిగింది. అదేవిధంగా దిరిసినపల్లి గ్రామానికి చెందిన బల్లెం గంగాభవానీ కుటుంబాన్ని వెలివేసిన సంఘటనపై ఇప్పటికే పలుమార్లు దరఖాస్తు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండా అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని, ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి గ్రామ బహిష్కరణ (వెలువేత)పై కేసులు నమోదు చేయాలని కోరడం జరిగింది. అదేవిధంగా గత నెల 24వ తేదీన క్వారీ వల్ల నష్టపోతున్న ఇళ్లను పరిశీలిస్తామని వచ్చి ఆదివాసులకు ఆదివాసులకు మధ్య గొడవలు సృష్టించి బాధితులపై దాడి చేయడానికి రెచ్చగొట్టిన రంపచోడవరం ఎమ్మార్వో, మైనింగ్ ఏడి పాడేరుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం ఏజెన్సీలో అక్రమ మైనింగ్ లు వ్యవస్థ ఆదివాసి ప్రజలను పట్టిపీడిస్తుందని, పర్యావరణం కాలుష్యం, అడవులు అంతరించిపోవడం, ప్రజా ఆరోగ్యం క్షీణించడం, ప్రజల ఆస్తులు ధ్వంసం అవ్వటం, పంట పొలాలకు నష్టం కలగటం వంటి సంఘటనలు జరుగుతున్నప్పటికీ గంగవరం మండలం ఓజు బంధం గ్రామ పరిధిలో మూడు నల్ల క్వారీలు నిర్వహణలో ఉన్నాయని, అంతేకాక గ్రామ ప్రజల అనుమతి లేకుండా మరొక కొత్త క్వారీని మొదలుపెట్టారని వీటన్నిటిపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించి మూసివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా నరసాపురం మెటల్ క్వారీ విషయంలో నరసాపురం మరియు దిరిసినపల్లి గ్రామాలకు చెందిన నష్టపోతున్న బాధితులు నెలలు తరబడి పోరాటం చేస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. మైనింగ్ డిపార్ట్మెంట్ స్థానిక రెవిన్యూ డిపార్ట్మెంట్ మైనింగ్ మాఫియా తోటి కుమ్మక్కై ప్రజలకు ఎటువంటి నష్టం కలగడం లేదని తప్పుడు నివేదికలు పంపిస్తున్నారని ఆయన మండిపడ్డారు. క్వారీల మీద బాధితులు ఫిర్యాదు చేస్తే అదే గ్రామానికి చెందిన కొంతమంది ఆదివాసులను మైనింగ్ మాఫియా మరియు అధికారులు పథకం ప్రకారం రెచ్చగొట్టి బాధితులపై దాడులు చేయిస్తున్నారని సెప్టెంబర్ 13వ తేదీ రోజున నరసాపురంలో మరియు గత నెల24వ తేదీనా దిరిసినపల్లి గ్రామంలో విచారణ పేరుతో వచ్చిన రంపచోడవరం ఎమ్మార్వో, మైనింగ్ ఏడి ఆదివాసుల్ని రెచ్చగొట్టి బాధితులపై దాడులు చేయించారని అంతేకాకుండా ఆదివాసులు ఆదివాసులు కొట్టుకునేటట్లు చేసుకొని ఇరువర్గాలపై పథకం ప్రకారం కేసులు పెట్టించి ఆదివాసులు ఇబ్బంది పెట్టించాలని చూస్తున్నారని కావున రంపచోడవరం ఎమ్మార్వోపై మరియు మైనింగ్ ఏడి పాడేరు వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు తక్షణమే నమోదు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని అక్రమ మైనింగ్ పై ఉద్యమం ఆపబోయేది లేదని ఎటువంటి దాడులు జరిగిన ఎటువంటి బెదిరింపులు వచ్చిన ఉద్యమ మరింత ఉధృతం అవుతుంది తప్ప వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ప్రజలకు పర్యావరణానికి జీవజాలానికి హాని, ఏజెన్సీ చట్టాలకు హాని కలిగించేటటువంటి మైనింగ్లు ఏజెన్సీ ప్రాంతానికి అవసరం లేదని కావున ఏజెన్సీలోని అక్రమ మైనింగ్ లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని లేదంటే ప్రజా ఉద్యమం తప్పదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ కుమార్ దొర, పీతా ప్రసాద్, కంగాల అబ్బాయి దొర, చోడి ఏడుకొండలరావు, బల్లెం గంగాభవానీ, కుంజం లక్ష్మణరావు, చేడం పోతురాజు దొర, చోడి దొరయ్య బాబు, పాతర లోవకుమారి, బాపనమ్మ, పాపయమ్మ, మల్లమ్మ, ఓజుబంద గ్రామస్తులు, ఓజుబంద క్వారీ, నర్సాపురం క్వారీ బాధితులు పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యాల కల్పనే లక్ష్యంగా పనులు - అన్నదాన పథకానికి విరాళం




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలు కల్పన లక్ష్యంగా పనులు చేస్తున్నట్లు చైర్మన్ ముదునూరి వెంకట్ రాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు లు అన్నారు. సోమవారం ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు నిత్య అన్నదాన పథకానికి కరప మండలం, పెనుగుదూరు అనిశెట్టి భరతబాబు, నాగదుర్గ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.53,902లు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు అలాగే మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రములతో సత్కరించారు. దాతలకు సూపర్నెంట్ రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## మచ్చలేని ప్రజా సేవకులు పొట్టి శ్రీరాములు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు మచ్చలేని ప్రజాసేవా తత్పురుడని విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వంరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాన్ని తృణప్రాయంగా భావించి గాంధీ ఆదర్శాలకు ,ఆశయాలకు ప్రభావితుడై స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు అని అన్నారు. శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసారని అన్నారు. ఆయన ఆత్మ త్యాగ ఫలితంగా రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. తదనంతరం తెలంగాణ ఉద్యమంతో తెలుగురాష్ట్రం రెండుగా విభజించ బడిందని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సామాజికవేత్త వరదరాజకు పురస్కారం



**కాకినాడ,మేజర్న్యూస్ :**ప్రముఖ సామాజికవేత్త తోకల వరద రాజ సాంచికి అంతర్జాతీయ పురస్కారం లభించింది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డును సామాజి కవేత్త తోకల వరదరాజ సాంచికి మహారాష్ట్ర ఔరంగాబాద్ నందు యూనివర్సిటీ ఆఫ్ టోలసో–మెక్సికో వారు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా లయన్ డి.వి. కట్టా బొమ్మన్ యూనివర్సిటీ ఆఫ్ టోలసో–మెక్సికో, ఇండియా డైరెక్టర్, డా.నార్వేడ్ జే.యమ్ మేంబర్ డా.బాబా సాహెబ్ అంబేద్కర్ మరాత్వాడా యూనివర్సిటీ, చత్రపతి, షాంబాజీ నగర్ మహారాష్ట్ర అశోక్ యార్కర్, పిడబ్ల్యుడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఔరంగాబాద్ మహారాష్ట్ర,యూనివర్సిటీ ఆఫ్ టోలసో–మెక్సికో కోఆర్డినేటర్ డాక్టర్ కాతే శంకర్,యూనివర్సిటీ ఆఫ్ టోలసో–మెక్సికో కోఆర్డినేటర్ డాక్టర్ నల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులుగా కామ్రేడ్ కె.వి.శేఖర్ మాస్టర్ ఏకగ్రీవంగా ఎన్నిక




**రావులపాలెం,మేజర్న్యూస్ :** ఎస్టియు ఎపి 79వ వార్షిక ఎన్నికల 14వ తేదీన ఆదివారం కడప పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గుజ్జల ఈశ్వరయ్య, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఆర్ట్స్ కాలేజ్ నుండి 4కి.మీ.లు రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన వేలాది ఉపాధ్యాయులతో భారీ బహిరంగ ర్యాలీ జడ్పీ మీటింగ్ హాల్ వరకు ఉత్సాహంగా జరిగింది.

సాయంత్రం 7గంటలకు మాజీ ఎమ్మెల్సీ నర్సింహా రెడ్డి ఎలక్షన్ ఆఫీసర్‌గా జరిగిన ఎన్నికల్లో గత సంవత్సరం బాడీనే కొనసాగిస్తు ఎస్టియు అధికార మాసపత్రిక "ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు"ను మాత్రం మారుస్తూ రావులపాడు జడ్పీ హైస్కూలుఇంగ్లీష్ ఉపాధ్యాయులు, ఎస్టీయూ సీనియర్ నాయకుడు కె.వి.శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అయన ఓ ప్రకటనలో తెలిపారు.వీరిని రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి, యల్.సాయి శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, ఎస్టీయూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు దొరబాబు, కళ్యాణ్ అభినందించారు.

# తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకుందాం

**– మంత్రి కందుల దుర్గేష్**
**– వెలుగుబంటి రామచంద్రారావు ఛారిటబుల్ ట్రస్ట్, శ్రీ షిర్డీసాయి విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు స్ఫూర్తిదాతల విగ్రహావిష్కరణ మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్:** తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకు ందామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ప్రాథమిక విద్య మాతృభాష లోనే జరగాలన్న అంశానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సోమవారం కడియంలో రాజమహేంద్ర వరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన వెలుగుబంటి రామచంద్రారావు ఛారిటబుల్ ట్రస్ట్,శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు స్ఫూర్తిదాతల విగ్రహావిష్కరణ మహోత్స వంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈసందర్భంగా ప్రాతఃస్మరణీ యులైన చేళ్లపిళ్ల వేంకట శాస్త్రి,దివాకర్లశాస్త్రి, దువ్వూరు సుబ్బమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన దువ్వూరి సుబ్బమ్మ మనవరాలు దువ్వూరి రాజ్యలక్ష్మికి, నిర్వాహకులకు మంత్రి దుర్గేష్ అభినందనలు తెలి పారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అద్భుత క్రీడా మైదానంతో విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసం కోసం షిర్డీసాయి విద్యాస ంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. గురుజాడ వేంకట అప్పారావు, చల్లపల్లి వేంకటశాస్త్రి గృహాలను, స్థలాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరముంద న్నారు.ఈ సందర్భంగా వేంకట శాస్త్రి, దివాకర్ల శాస్త్రిల నాటకం కురుక్షేత్రా న్ని గుర్తుచేసుకున్నారు. తిరుపతి వెంకట కవులు రాసిన చెల్లియో చెల్లకో తమకు చేసిన యెగ్గులు సైచిరందరున్ తొల్లి, మామ ఎప్పుడు వచ్చితివి, జెండాపై కపిరాజు, అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడు అజాత శత్రుడే అలిగిననాడు తదితర పద్యాలను స్మరించుకున్నారు.గత ప్రభుత్వం తెలుగును విస్మరించిందని విమర్శించారు. ఈసందర్భంగా ప్రాథమిక విద్యలో మాతృభాష విద్యా బోధనను తల్లిపాలు తాగి పెరిగిన పిల్లలతో, ఆంగ్లబోధనను పోత పాలతో తాగిపెరిగిన పిల్లలతో పోల్చిచెప్పారు. త్రిభాష సూత్రం అవసరాన్ని వివరించారు. అన్ని భాషలకు ప్రాధాన్యతనిస్తూనే తెలుగు అగ్రతాంబూలం ఇవ్వాలన్నారు. తెలుగుకు మరింత గుర్తింపు రావాల్సిన అవసర ముందని అభిప్రాయపడ్డారు. చేళ్లపిళ్ల వేంకట శాస్త్రి, దివాకర్ల శాస్త్రి, దువ్వూరు సుబ్బమ్మ విగ్రహాలను పుష్కరాల సమయంలో గోదావరి గట్టు మీద ఏర్పాటు చేయాలని తెలుగు సాహితీ కార్యక్రమాలు, నిర్వహణ కమిటీ చైర్మన్, కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ చేసిన వినతి సముచితం అన్నారు. అందుకు కృషి చేస్తామన్నారు. గతంలో జరిగిన నంది నాటకోత్సవాలను ఉదహరిస్తూ సరైన విధానంలో పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తే నేటికీ కూడా ఆదరణ ఉంటుందన్నారు. నేటికీ లండన్ లో థియేటర్ ఆర్ట్స్ కి నేటికి ఆదరణ ఉందన్నారు. గతంలో హామ్లెట్ అనేనాటకాన్ని ప్రదర్శించినప్పుడు సినిమా థియేటర్ కంటేఎక్కువగా జనం వచ్చిన ఘటనను ఉదహరించారు. ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా లాంటి విభాగాన్ని రాజమండ్రిలో ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌నుఅభ్యర్థించానని, సూత్రప్రాయంగా అంగీకరిం చారని అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో స్థలం సూచిస్తే అందులో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా విభాగం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. తెలుగుభాషను పెంచి పోషించినప్పుడే తిరుపతి వేంకట కవులకు ఘన నివాళి అర్పించిన వాళ్లమవుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మండలి బుద్ధ ప్రసాద్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శ్రీమతి దువ్వూరి రాజ్యలక్ష్మి, తెలుగు సాహితీ కార్యక్రమాలు, నిర్వహణ కమిటీ చైర్మన్, కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్,హాస్యబ్రహ్మ శంకరనారాయణ, అవధా నులు ధూళిపాల మహదేవ మణి, తాతా సందీప్ శర్మ, ఆకెళ్ళ బాలబాను పాల్గొన్నారు.

# స్థాయి మరచి 'పిల్లి' దిగజారుడు మాటలు

ప్రజలు మీ బెండు తీసి ఎప్పుడో ఇంటికి పంపారు
సమాజ శ్రేయస్సు కోసమే సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ స్థాపన
రామచంద్రపురం రెవిన్యూ డివిజన్ పై విష ప్రచారం ఆపండి
ఇల్లును చక్కదిద్ది సమాజం కోసం రండి.
రాజకీయ లబ్ధి కోసమే వ్యక్తిగత విమర్శలు
వాసంశెట్టి సత్యం ను విమర్శించే స్థాయి నీది కాదు
వైసీపీ తీరుపై మరోసారి కూటమి నాయకుల ఫైర్



రామచంద్రపురం,డిసెంబర్ 15: రాజకీయ లబ్ధి కోసం స్థాయి మరచి , సమాజ సేవ కోసం నిత్యం పరితపిస్తున్న మంత్రి సుభాష్ ను, కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం పట్ల వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాశ్ దిగజారుడు మాటలు వాగుతున్నారని కూటమి పార్టీ నాయకులు మరోసారి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అక్కలరిశ్వంత్‌రాయ్, రామచంద్రపురం రూరల్ మండలం అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, టేకుమూడి సత్యనారాయణ, కంచుమర్తి బాబురావు, కాటే సుబ్రహ్మణ్యంలు మాట్లాడారు.ఈసందర్భంగా ఎఎంసి చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్ మాట్లాడుతూ రామచంద్రపురం రెవిన్యూ డివిజన్,సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయం యధాతథంగా కొనసాగుతుందని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి సుభాష్ హామీ ఇచ్చినా వైసీపీ నాయకులు విష ప్రచారం చేస్తూ. ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నా రు. రామచంద్రపురం రెవిన్యూ డివిజన్ విషయమై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సీఎంను రెండుసార్లు కలిసి స్పష్టమైన హామీ తీసుకున్నప్పటికీ కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని వైసీపీనీచ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.సమాజ శ్రేయస్సు కోసంసత్యం వాసంశెట్టి ఫౌండేషన్ స్థాపించి పేదలకు సేవచేస్తున్న మంత్రి తండ్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. రూరల్ మండలాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు మాట్లాడుతూ పిల్లి సూర్యప్రకాష్ మాట తీరు, ప్రవర్తన మార్చుకోవాలన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే మంత్రి సుభాష్,వాసంశెట్టి సత్యంపై అసత్య ప్రేలాపనలుమానుకోవాలనిఆగ్రహంవ్యక్తంచేశారు.టేకుమూడి సత్యనారాయణ మాట్లాడుతూరెవెన్యూ డివిజన్‌పై వైసిపి తమఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే ఈతరహా క్రియలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ జిల్లాల విభజనపై మీ తండ్రిని, జగన్ను ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు.వైసిపి ప్రభుత్వంలో మీరేం చేశారు అని ప్రశ్నించారు. మంత్రి సుభాష్ సీఎం చంద్రబాబుని కలిసేటప్పుడు మీకు చెప్పాలా..అని ప్రశ్నించారు. మంత్రి సుభాష్ జమీందార్ పాత్రలో నటిస్తే ఎందుకు అక్కసు కక్కుతున్నారు.. మీకు కూడా అసిస్టెంట్ పాత్ర కావాలంటే చెప్పండి..మంత్రి రికమెండ్ చేస్తారుఅంటూ చమత్కరించారు. గత ఎన్నికల్లో ప్రజలు మీ బెండు ఎప్పుడో తీశారు.. అని ఎద్దేవా చేశారు. వైసీపీ పార్టీకి ఎప్పుడో రాజీనామా చేసిన మంత్రి సుభాష్ తల్లి పేరు వాడి నీచ రాజకీయాలకు తెర తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు పేద ప్రజలకు ఏనాడైనా చిన్న సహాయం చేశారా.. అంటూ ప్రశ్నించారు. కౌన్సిలర్ అంకం శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి సుభాష్‌అందుబాటు లేని సమయంలో కూడా ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు చేస్తున్నారన్నారు. విచక్షణ కోల్పోయి,ఓర్వలేక పెద్దరికం చూడకుండా మాట్లాడడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. వ్యక్తిగతంగా మహిళలకు, నిరుద్యోగులకు, పేదవారికి అన్ని విధాల సహకరిస్తున్న గొప్ప మనసున్న వ్యక్తిపై వ్యక్తిగత దూషణలు సరికాదని హెచ్చరించారు. కంచుమర్తి బాబురావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని కుటుంబంగా భావించి పేదలకు సేవ చేసేందుకు ఫౌండేషన్ స్థాపించి, సమాజసేవ చేస్తున్న వాసంశెట్టి సత్యంపై దిగజారుడు మాటలు ఏంటని హెచ్చరించారు. ప్రతిరోజు వైసీపీ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి క్యూకడుతున్న మీనాయకులను కాపాడుకో.. ఆతర్వాత రాజకీయాలు చేద్దువు అంటూ హితవు పలికారు. రామచంద్రపురంలో వైసిపి కౌన్సిలర్లను అడగండి.. అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో వాళ్లే చెబుతారు.. రెవెన్యూ డివిజన్ పై రాజకీయం చేసి ప్రజలను, విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.వైసీపీ పార్టీలో ఉన్న వారు కూడా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా లబ్ధిపొందారని.. లేదని నిరూపించగలరా అంటూ సవాలు విసిరారు. మంత్రిసుభాష్ అన్ని విషయాల్లో సమర్థుడు.. వ్యక్తిగత విమర్శలు వద్దు.. మంత్రి సుభాష్.. ఆయన తండ్రి సత్యం జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికి సహాయం చేసే మంత్రి నిజంగానే జమిందార్ అని,ఆ విషయంలో మంత్రి ముందు వరుసలో ఉంటారన్నారు. కాటే సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.. తప్పులన్నీ మీ పార్టీలో పెట్టుకుని మంత్రి సుభాష్ పై ఏడవడం దేనికని సూటిగా ప్రశ్నించారు. రాజకీయ భవిష్యత్తు ఉండదనే ఉద్దేశంతో దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోవాలని తీవ్రంగా హెచ్చరించారు. మంత్రి సుభాష్ 18 నెలల కాలంలో సుమారు 155 కోట్లు తో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, చందమామ వాసు, మాజీ అధ్యక్షులు కడియాల రాఘవన్, దంగేటి గౌరీ శంకర్, నారపురెడ్డి బలరాం, కవల నానాజీ, వీరబాబు, శివాలయం చైర్మన్ గణేష్ శర్మ,, ఏసుదాసు, మురళి, సత్తిబాబు, వాసంశెట్టి చంద్రశేఖర్, మల్లిపూడి బుజ్జి, కొండేపూడి సురేష్, పోలిశెట్టి పెదబాబు,శివప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం వద్ద హద్దు మీరితే చర్యలు తప్పవు

**– పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం శ్రీపాద శ్రీ వల్లభ సంస్థానం ఆలయం వద్ద ఆటో మరియు కారు డ్రైవర్లు హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ హెచ్చరించారు. పిఠాపురం పట్టణ ఎస్సై వి. మణికుమార్ మరియు సిబ్బందితో కలిసి స్థానిక శ్రీపాద శ్రీ వల్లభ దత్తాత్రేయ గుడి వద్ద ఆటో, మరియు కార్ డ్రైవర్లకు చట్టంపై అవగాహన కల్పించారు. ఆల యానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారందరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఏదైనా సమస్య ఏర్పడినట్లయితే వెంటనే పోలీస్ స్టేషన్ కు సమాచారం అందజేయాలని, గుడి వద్ద ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరక్కుండా జాగ్రత్త వహిం చాలని, ఒకవేళ ఎవరైనా హద్దు మీరు ప్రవర్తించినా గొడవలకు కారణమైన వారందరిపైన కేసులు నమోదు చేసి, బైండ్ ఓవర్‌చేసి వారిపైరౌడీసీట్స్‌ఓపెన్‌చేస్తామని హెచ్చరించారు.

## తాడేపల్లి కార్యాలయానికి కోటి సంతకాల సేకరణ ప్రతులు

**– జండా ఊపి పంపించిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి**
**– వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో భారీ ర్యాలీ**
**– జై జగన్ జై జగన్ అంటూ నినాదాలు**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ముగించుకుని కోటి సంతకాల సేకరణ ప్రతులను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి జెండా ఊపి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్దకు పంపించారు.ఈ కార్యక్రమ ంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చాదస్తం ఫుడ్స్‌కి ఎక్సలెంట్ అవార్డు




**ఆత్రేయపురం,మేజర్ న్యూస్ :** విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఛాం బర్స్ బిజినెస్ ఎక్స్‌పో కార్య క్రమంలో ఆత్రేయపురం మండలంలోల్ల లాకుల వద్ద సంప్రదాయ రుచులు అందిస్తున్న చాదస్తం ఫుడ్స్‌కు ఏక్స లెన్స్ ఇన్ ట్రేడీషన ఫుడ్ ప్రోడక్ట్స్ అవార్డ్ లభించింది. విజయవాడలో ఈ నెల 12 నుండి 14 వరకు నిర్వహిం చిన ఏపి ఛాంబర్ ఆఫ్ బిజినెస్ ఎక్సపోలో సాంప్ర దాయ ఆహార ఉత్పత్తుల రంగంలో తన విశిష్ట సేవలకు గాను చాదస్తం ఫుడ్స్‌కు ఈ అవార్డ్ లభించింది. సాంప్రదాయ పద్ధతుల్లో, స్వచ్ఛత మరియు నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ ఎలాంటి కృత్రిమ రంగులు లేదా ప్రిజర్వేటివ్స్ ఉపయోగిం చకుండా తయారు చేస్తున్న ఉత్పత్తులకుగాను ఈ అవార్డు అందజేసారు. ముఖ్యంగా ఆత్రేయపురం పూతరేకులు సంప్రదాయ మిఠాయిలు, పిండి వంటలు, స్నాక్స్, కారం పొడులు, సీజనల్ పచ్చళ్ళతో చాదస్తం ఫుడ్స్ వినియో గదా రుల విశ్వాసాన్ని సంపాదించింది.ఈ సందర్భంగాచాద స్తం ఫుడ్స్ వ్యవస్థాపకులు చవాకుల సాయి ప్రసన్న మాట్లాడు తూ ఈ అవార్డు మా కృషికి, మా బృందానికి గ్రామీణ మహిళల శ్రమకు, లభించిన గౌరవం అని ఆనందం వ్యక్తం చేశారు. మాపై నమ్మకం ఉంచిన మమ్ములను ఆదరించిన కస్టమర్లకు ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా సంప్రదాయ రుచులను అదే స్వచ్ఛతతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అన్నారు.